రైతుల్లేరు.. రూ. కోట్లు బజారుపాలు





వైకాపా ప్రభుత్వ హయాంలో సాగిన రూ. కోట్ల ప్రజాధనం దుబారాకు ఈ చిత్రం ఓ నిదర్శనం. యర్రగొండపాలెంలో రైతు బజారు నిర్మించాలని అప్పటి మంత్రి ఆదిమూలపు సురేష్ నిర్ణయించారు. వాస్తవానికి ఈ ప్రాంతంలో కూరగాయల సాగు కేవలం యాభై హెక్టార్లకు మించిలేదు. అయినప్పటికీ వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) నిధులు రూ.1.28 కోట్లు వెచ్చించి జన సంచారం లేని చోట పట్టణానికి దూరంగా ఎన్నికల ముందు హడావుడిగా నిర్మించారు. బిల్లులు పూర్తిగా ఇవ్వకపోవడంతో గుత్తేదారు సదరు నిర్మాణాన్ని ఇంకా ఏఎంసీకి అప్పగించలేదు. ఊరికి ఓ మూలగా నిర్మించడంతో ఇక్కడ విక్రయాలకు రైతులూ ముందుకు రావడం లేదు. దీంతో రైతుబజారు ప్రాంగణం నిరుపయోగంగా ఉంటూ మందుబాబులకు అడ్డాగా మారింది.

– ఈనాడు, ఒంగోలు; న్యూస్‌టుడే, యర్రగొండపాలెం

ఉమ్మడి ప్రకాశం జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

కందుకూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉమ్మడి ప్రకాశం జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్లను ఎంపిక చేసినట్లు పీడీ ఎస్.సురేశ్ తెలిపారు. కందుకూరులోని టీఆర్‌ఆర్ కళాశాల క్రీడా మైదానంలో శనివారం ఈ ఎంపిక ప్రక్రియ చేపట్టారు. దీనికి 40మంది బాలబాలికలు హాజరయ్యారు. వీరిలో 12 మంది బాలికలను, 12మంది బాలురను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ జట్లు రాష్ట్ర స్థాయిలో జరిగే సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని వివరించారు. ఈ ఎంపికల్లో పీడీలు సుబ్బారావు, పి.శ్రీనివాసరావు, నరసింహం, చిట్టెమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

నగదు ఇవ్వు.. లేఖ తీసుకెళ్లు



కలెక్టరేట్‌లో వేచి ఉన్న సచివాలయ సిబ్బంది


- సచివాలయ బదిలీల్లో ఇష్టారాజ్యం
- చేయి తడిపితేనే సిబ్బందికి ఉత్తర్వులు
- చక్రం తిప్పుతున్న అధికారిణి, ఉద్యోగులు

జిల్లాలోని గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ఇష్టారాజ్యంగా కొనసాగుతోంది. సాధారణ ఉద్యోగులతో పాటు, సచివాలయాలకు సంబంధించిన బదిలీల ప్రక్రియకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. చిరుద్యోగులు కావడంతో పారదర్శకంగా చేపట్టాలన్న ఉద్దేశంతో ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించారు. దీంతో 253 మంది (గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు, 356 మంది గ్రేడ్-6 కార్యదర్శులు(డిజిటల్ సహాయకులు) దరఖాస్తు చేసుకున్నారు. ఈ రెండు విభాగాల ఉద్యోగులు జిల్లా పంచాయతీ కార్యాలయం పరిధిలోకి వస్తారు. వీరందరికీ గత నెల 9, 10 తేదీల్లో ఒంగోలులోని పాత జడ్పీ కార్యాలయం సమావేశ మందిరంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. – న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

రోజులవుతున్నప్పటికీ చేరక...: నిబంధనల ప్రకారం గత నెల 22వ తేదీతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖల ఉద్యోగుల బదిలీల గడువు ప్రక్రియ పూర్తయింది. ఇతర జిల్లాల్లో ఉద్యోగులు ఇప్పటికే తమకు కేటాయించిన చోట విధుల్లో చేరారు. జిల్లాలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. నిబంధనల ప్రకారం కౌన్సెలింగ్‌కు వచ్చిన ఉద్యోగుల పోస్టింగ్ వివరాలను సదరు ఎంపీడీవో కార్యాలయానికి మెయిల్‌తో పాటు, ఉద్యోగికి నియామక పత్రాలను పోస్ట్ చేయాల్సి ఉంటుంది. జిల్లాలో ఇంతవరకు ఆ ప్రక్రియ చేపట్టింది లేదు. ఇప్పటికీ పోస్టింగ్ ఉత్తర్వులు చేతికి అందించలేదు.


రూ. 20 వేల వరకు వసూళ్లు...

జిల్లాలో బదిలీల వ్యవహారంపై ఉత్కంఠ కొనసాగుతోంది. దీంతో కొందరు ఉద్యోగులు గత వారం రోజులుగా డీపీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఇదే ఆసరాగా ఒక్కో ఉద్యోగి నుంచి వసూళ్ల పర్వానికి తెర లేపారు. రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఇప్పటికే నగదు వసూలు చేసినట్లు సమాచారం. కార్యాలయానికి చెందిన ఓ పూర్వ అధికారిణితో పాటు, ప్రస్తుతం కార్యాలయంలోని మరో ఇద్దరు ఉద్యోగులు ఈ వ్యవహారంలో సూత్రధారులుగా చక్రం తిప్పుతున్నారు. తమతో సన్నితంగా ఉండే సచివాలయ ఉద్యోగులకు నగదు వసూలు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఉద్యోగుల నుంచి పెద్ద మొత్తంలోనే నగదు వసూలు చేసినట్లు సమాచారం. బదిలీల గడువు ముగిసి రెండు వారాలు గడిచినా ఇంతవరకు ఉద్యోగులకు పోస్టింగ్ ఉత్తర్వులు అందకపోవడం.. డీపీవో కార్యాలయంలో ఉత్తర్వులు తయారు చేసే ప్రక్రియ ఇంకా కొనసాగుతుండటంతో సదరు ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. గత వారం రోజులుగా కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. శనివారం పెద్ద సంఖ్యలో తరలివచ్చి రాత్రి పొద్దుపోయే వరకు వేచి ఉన్నారు.



టోకెన్ తీసుకోకుంటే తోలు తీయిస్తాం

- పోలీసులతో చెప్పి విమానమెక్కిస్తాము
- గ్రా'నైట్' దందా అక్రమార్కుల బెదిరింపులు
- కలకలం రేపుతున్న ఆడియోలో మాటలు



'అటు.. ఇటు మా పోలీసులే ఉన్నారు. అటు రూ. 25 లక్షలు., ఇటు రూ. 40 లక్షలు.. మొత్తంగా రూ.65 లక్షలు కడుతున్నాం. బండికి రూ.40 వేలు వసూలు చేస్తున్నాం. మాకు తెలియకుండా., మా దగ్గర టోకెన్ తీసుకోకుండా మీరు బండ్లు పంపుతున్నట్లు తెలిసింది. రాత్రి కూడా ఒక బండి పంపారు. అలా ఎన్నాళ్లు పంపుతారో పంపండి. పొదిలి, తాటివారిపల్లె, గిద్దలూరు, మార్కాపురంలో మా పోలీసులే ఉన్నారు. వారంతా మాకు పూర్తి అధికారాలు ఇచ్చారు. తెలియకుండా బండి పంపితే.. ఎక్కడైనా తేడా పడితే ఏమీ అనుకోవద్దు. విమానం ఎక్కించి తోలు తీయిస్తాం..' ఇదీ గ్రానైట్ చీకటి దందాకు పాల్పడుతున్న వ్యక్తుల బెదిరింపుల పర్వం. – న్యూస్‌టుడే, ఒంగోలు నేరవిభాగం



జిల్లాలో గ్రానైట్ అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ కొందరు అక్రమార్కులు జీరో బిల్లులతో రాళ్లను జిల్లా దాటిస్తున్నారు. ఈ క్రమంలో దళారుల మధ్య పోటీ నెలకొంది. రాత్రివేళల్లో వీధి పోరాటాలకు ఈ పరిస్థితులు దారి తీస్తున్నాయి. అక్రమార్కులకు అటు గనులు, వాణిజ్య పన్నుల శాఖలో, ఇటు పోలీసు శాఖలోని కొందరు సహకరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా వెలుగు చూసిన ఆడియో ఇందుకు బలం చేకూరుస్తోంది. గత కొన్నాళ్లుగా కొందరు వ్యక్తుల ఆధ్వర్యంలో ఈ తరహా దందా నిరాటంకంగా సాగిపోతుంది. చీమకుర్తి నుంచి ఒంగోలు, సింగరాయకొండ మీదగా కృష్ణపట్నంకు ఒక మార్గం, చీమకుర్తి నుంచి పొదిలి, మార్కాపురం మీదుగా హైదరాబాద్‌కు, గిద్దలూరు మీదుగా బెంగళూరు వైపునకు ప్రతి నిత్యం జీరో బిల్లులతో గ్రానైట్ పలకలతో కూడిన వాహనాలు తరలిపోతున్నాయి.

చెల్లించకుంటే నిలిపివేతలు...: కొందరు నాయకుల ఆశీస్సులతో గ్రానైట్ దందా కొనసాగుతోంది. దీంతో ఆయా మార్గాల్లో వెళ్లే ప్రతి లారీకి రూ.40 వేలు చెల్లించిన తర్వాతే వాహనం నడపాలని అక్రమార్కులు డిమాండ్ చేస్తున్నారు. టోకెన్లు తీసుకున్న తర్వాతే ఆయా మార్గాల్లో వాహనాలకు సజావుగా అనుమతి ఇస్తున్నారు. అవి లేని వాటిని మాత్రం ఎక్కడికక్కడ నిలిపివేసి కేసులు నమోదు చేస్తున్నారు. ఇటీవల కాలంలో చినారికట్ల వద్ద ఎస్సైలు తమ పరిధి దాటి వెళ్లి మరీ లారీలను ఆపి కొందరిపై దాడి చేయడం ఇందుకు నిదర్శనం. ఈ వ్యవహారం తీవ్ర వివాదాస్పదమైంది. తాజాగా ఫ్యాక్టరీ నుంచి జారీ చేసిన సక్రమ బిల్లులతో వ్యాపారం నిర్వహిస్తున్న వ్యక్తి ఒకరికి ఈ దందా నిర్వహిస్తున్న వ్యక్తులు ఫోన్ చేసి తీవ్రంగా బెదిరింపులకు గురిచేయడం గమనార్హం. మీ వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వదలమని, పట్టుకొని తీరుతామని హెచ్చరించడం పరిస్థితి తీవ్రతను చెప్పకనే చెబుతోంది.

ఆందోళన కలిగిస్తున్న పరిణామాలు...: గ్రానైట్ రాళ్లు తరలిపోయే మార్గాల్లోని అధికారులకు తాము రూ.65 లక్షలు చెల్లిస్తున్నామని.. తమకు లారీకి రూ.40 వేలు చెల్లించిన తర్వాతే సరకు రవాణా చేసుకోవాలని స్థానిక వ్యాపారులను తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేస్తుండటం ఆందోళన కలిగించే పరిణామం. ఆయా మార్గాల్లో తమకు సహకరించే పోలీసులు ఉన్నారని.. వారంతా తమకు పూర్తిస్థాయి అధికారులు ఇచ్చారంటూ తీవ్ర స్థాయిలో బెదిరించడం గ్రానైట్ వర్గాల్లో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గత కొంత కాలంగా సాగుతున్న ఈ దందాపై చీమకుర్తి గ్రానైట్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. వీటిపై జిల్లా యంత్రాంగం సీరియస్‌గా దృష్టి సారించాల్సి ఉంది.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు దసరా సెలవులు

వేంపల్లె, న్యూస్‌టుడే: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ఆదివారం నుంచి ఈ నెల 13 వరకు దసరా సెలవులు ప్రకటించారు. దీంతో ఆయా ట్రిపుల్ ఐటీల్లోని తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు శనివారం స్వగ్రామాలకు బయలుదేరారు. ఇడుపులపాయ క్యాంపస్ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. సెలవులకు వెళ్లిన విద్యార్థులు ఈ నెల 14న ఆయా క్యాంపస్‌లకు తిరిగి చేరుకోవాలని ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ సూచించారు.



చంద్రఘంటా దేవీ నమోస్తుతే

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రసిద్ధినొందిన త్రిపురాంతకం బాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో వైభవంగా సాగుతున్నాయి. మూడో రోజైన శనివారం చంద్రఘంట అలంకారంలో వ్యాఘ్ర వాహనంపై భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. ఉభయదాతల పూజల అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య అమ్మవారి ఊరేగింపు రాత్రివేళ కోలాహలంగా నిర్వహించారు. – న్యూస్‌టుడే, త్రిపురాంతకం గ్రామీణం





విద్యుత్తు శాఖ అధికారుల నిర్లక్ష్యానికి ఈ చిత్రమే నిదర్శనం. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు అవసరమైన సంఖ్యలో స్తంభాలు ఏర్పాటు చేయకపోవడంతో కొన్నిచోట్ల రైతులు కట్టెలకు తీగలు కట్టారు. వాటిని మోటార్లకు అనుసంధానించుకుని పంటలకు నీటి తడులు అందించుకుంటున్నారు. దీంతో తీగలు చాలా చోట్ల తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా వేలాడుతూ కనిపిస్తున్నాయి. యర్రగొండపాలెం మండలం అమానిగుడిపాడులో ఓ రైతు తన పొలంలో మిర్చి సాగు చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి కలుపు తీత పనులు చేస్తున్నారు. అదే సమయంలో వారి తలలపై అతి తక్కువ ఎత్తులో విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయి. పనుల వేళ ఏమాత్రం ఆదమరిచి వాటిని తాకినా అపాయం తప్పదు. విద్యుత్తు శాఖ అధికారులు స్పందించి పంట పొలాల్లోని కట్టెల స్థానంలో స్తంభాలు ఏర్పాటు చేస్తే సదరు రైతులకు ఎంతో మేలు.

– ఈనాడు, ఒంగోలు



మంగళగిరిలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తున్న దామచర్ల సత్య




విజయవాడలోని కార్యాలయంలో దస్త్రంపై సంతకం చేస్తున్న నూకసాని బాలాజీ

చేవ్రాలు.. కొలువుదీరిన బాధ్యతలు

మారిటైం బోర్డు ఛైర్మన్‌గా దామచర్ల సత్యనారాయణ(సత్య) మంగళగిరిలోని కార్యాలయంలో; పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నూకసాని బాలాజీ విజయవాడలోని కార్యాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమాలకు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన పలువురు కూటమి నేతలు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో భారీగా తరలి వెళ్లారు. బాధ్యతల స్వీకరణ అనంతరం కార్పొరేషన్ ఛైర్మన్లు సత్య, బాలాజీలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు.

– న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

ఉపాధిలో రూ. కోటికి పైగా ఊడ్చేశారు



చరవాణి వెలుతురులో దస్త్రాలను పరిశీలిస్తున్న పీడీ జోసఫ్ కుమార్, అధికారులు

పీసీపల్లి, న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజా వేదికను పీసీపల్లిలో డ్వామా పీడీ జి.జోసఫ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 30 వరకు మండలంలోని 18 పంచాయతీల్లో చేపట్టిన 571 పనులు.. అందుకు చేసిన రూ.12,26,65,055 చెల్లింపుల వివరాలను పరిశీలించారు. ఇందులో రూ. కోటికి పైగా నిధులు పక్కదారి పట్టినట్లు గుర్తించారు. సభ సాగుతుండగానే సాయంత్రం సమయంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అయినప్పటికీ చరవాణుల వెలుతురులోనే వేదికను అధికారులు కొనసాగించారు. కార్యక్రమంలో ఏపీడీ రాజారావు, జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి, ఎస్టీఎం భాస్కర్, ఎస్ఆర్పీ సీఆర్ ఎన్.మూర్తి, ఏపీవోలు సుబ్బారావు, రాంబాబు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ఇవీ గుర్తించిన అవకతవకలు...: ◗ పంట కుంటల తవ్వకాలకు సంబంధించి కొలతల్లో భారీగా వ్యత్యాసాలున్నాయి. వీటిలో నిధులు దుర్వినియోగమయ్యాయి. ◗ పీసీపల్లి పంచాయతీలో కూలీల పేరుతో సంతకాలు లేకుండా వేతనాలు చెల్లించారు. ◗ నిబంధనలకు విరుద్ధంగా దంపతులకు వేర్వేరుగా వందకి పైగా జాబ్ కార్డులు జారీ చేశారు. ◗ వివాహాలై వేరే గ్రామాలకు వెళ్లిన మహిళల పేర్లతోనూ మస్టర్లు వేసి నిధులు నొక్కేశారు. ◗ వాలంటీర్లు వారానికి మూడు రోజులు మాత్రమే పనికి వెళ్లేందుకు అర్హులు. అయితే వారం మొత్తం పని చేసినట్లు మస్టర్లు వేసి వేతనాలు చెల్లించారు. ◗ పండ్ల తోటలు పెంచకుండానే బిల్లులు చెల్లించారు. ◗ వైకాపా ప్రభుత్వ హయాంలో సచివాలయాల వద్ద మొక్కలు నాటకుండానే బిల్లులు ఇచ్చేశారు. ◗ అత్యధికంగా పీసీపల్లి, పెదఇర్లపాడు పంచాయతీల్లో నిధులు దుర్వినియోగమయ్యాయి.

వరుణుడి అలక.. సూర్యుడి మంట



◗ వేసవిని తలపిస్తున్న పగటి ఉష్ణోగ్రతలు

జిల్లాలోని వాతావరణం వేసవిని తలపిస్తోంది. గత కొద్ది రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 36 నుంచి 40 డిగ్రీల మేర నమోదవుతున్నాయి. అక్టోబర్‌లో సాధారణంగా వర్షాలు కురుస్తూ వాతావరణం కాస్త చల్లగా ఉంటుంది. ఈ ఏడాది రెండో వారంలోకి ప్రవేశిస్తున్నా అందుకు భిన్నమైన వాతావరణం నెలకొంది. పగటితో పాటు, రాత్రివేళ కూడా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే సూరీడు సుర్రుమనిపిస్తున్నాడు. సాయంత్రం 4 గంటలకు కూడా వేడిగాలుల తీవ్రత కొనసాగుతోంది. పలు గ్రామాల్లో శనివారం 36 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వరుణుడు ముఖం చాటేయడం... పగటి ఉష్ణోగ్రతలు మరింత పెరగడంతో రాత్రి సమయంలో ప్రజలు ఉక్కపోతకు గురవుతున్నారు. – న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

అన్నదాతలోనూ ఆందోళన...: ఖరీఫ్ సీజన్ కింద రైతులు పలు రకాల మెట్ట పంటలు సాగు చేశారు. అత్యధిక ఉష్ణోగ్రతల కారణంగా మొక్క దశలోనే వీటిలో చాలా వరకు ఎండిపోతున్నాయి. సరియైన వర్షపాతం లేక నువ్వు పంట దిగుబడుల పైనా ప్రభావం చూపింది. రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా అత్యధిక విస్తీర్ణంలో పొగాకు, శనగ సాగు చేపట్టనున్నారు. తేలికపాటి నేలల్లో సెప్టెంబర్ నుంచే పొగాకు మొక్కలు వేస్తారు. అక్టోబర్‌లోనూ వర్షం లేకపోవడంతో కనిగిరి, పొదిలి వేలం కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో ట్యాంకర్లతో నీటిని తరలించి మొక్కలు నాటుతున్నారు. అధిక పగటి ఉష్ణోగ్రతల కారణంగా అవి బతకడం కష్టంగానే ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వై.చర్లోపల్లిలో 24.5 డిగ్రీలు...: పశ్చిమ ప్రకాశంలోని పలు ప్రాంతాల్లో రాత్రి వేళ కొంత మేర వాతావరణం చల్లగా ఉంటోంది. శుక్రవారం రాత్రి పెద్దదోర్నాల మండలం వై.చర్లోపల్లిలో 24.5; గిద్దలూరు, తర్లుపాడు మండలాల్లో 24.8 డిగ్రీల చొప్పున కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పశ్చిమ ప్రకాశంలోని పలు ప్రాంతాలు నల్లమల అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండటంతో కనిష్ఠ ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదు అవుతున్నట్లు భావిస్తున్నారు.

పలు ప్రాంతాల్లో శనివారం నమోదైన ఉష్ణోగ్రతలు(సెల్సియస్ డిగ్రీల్లో)...

మండలం	ప్రాంతం	గరిష్ఠం
మార్కాపురం	దరిమడుగు	38.0
పొన్నలూరు	మాలెపాడు	36.60
పొదిలి	కంభాలపాడు	36.59
మర్రిపూడి	వేమవరం	36.50
చీమకుర్తి	నిప్పట్లపాడు	36.40
కొనకనమిట్ల	చిన్నారికట్ల	36.39
కొండపి	కె.ఉప్పలపాడు	36.20
పెద్దదోర్నాల	పెద్దదోర్నాల	36.16
చీమకుర్తి	పల్లామల్లి	36.0

కాబోయే అమ్మకు అండ

◗ చెంచు గర్భిణులకు సౌకర్యాలు

◗ ఐటీడీఏ ఆసుపత్రుల్లో వసతులు

జిల్లాలోని ఏడు మండలాల్లో చెంచు గిరిజనులు నివాసం ఉంటున్నారు. ఆయా ప్రాంతాలు శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోకి వస్తున్నాయి. వీటిలో కొన్ని చెంచు గిరిజన గూడేలు నల్లమల అటవీ లోతట్టు ప్రాంతాల్లో ఉన్నాయి. అక్కడ నివసించే చెంచు గిరిజన గర్భిణులకు ఆరోగ్యం, ప్రసవ సమయంపై సరైన అవగాహన తక్కువ. ఆ సమయంలో వైద్యశాలకు వచ్చేందుకు రవాణా సౌకర్యాలు కూడా అంతగా అందుబాటులో ఉండవు. ఈ పరిస్థితులతో తరచూ తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ఈ విషయాన్ని గుర్తించిన గత తెదేపా ప్రభుత్వం పరిష్కారం దిశగా చర్యలు చేపట్టింది. పెద్దదోర్నాల, యర్రగొండపాలెం సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసూతి వసతి గృహాలు నిర్మించింది. ప్రసవానికి వారం రోజులు ముందుగానే వైద్యశాలకు వచ్చే గర్భిణులతో పాటు వారి సహాయకులకు వసతి కల్పించి ఆహారం అందించేలా ఏర్పాట్లు చేసింది. వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తూ సలహాలు, సేవలు అందించేలా చూసింది. వైకాపా ప్రభుత్వ హయాంలో ఈ ప్రక్రియను మూలకు నెట్టేసింది. గర్భిణులపై పర్యవేక్షణను విస్మరించింది. దీంతో వసతి గృహాలు మూలకు చేరాయి.

నిధుల మంజూరుతో మరమ్మతులు...: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గర్భిణులకు మెరుగైన వైద్యం అందించే దిశగా చర్యలు చేపట్టింది. అందుకోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. రూ. 36 లక్షలతో మార్కాపురంలో వసతి గదుల నిర్మాణం చేపట్టనున్నారు. రూ. 23 లక్షలతో పెద్దదోర్నాల, యర్రగొండపాలెం సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పించనున్నారు. రూ. 4 లక్షలతో ప్రసూతి మహిళల కోసం నిర్మించిన విశ్రాంతి గదులకు మరమ్మతులు చేయనున్నారు. ఈ పనులన్నింటినీ ఏడాదిలోపు పూర్తి చేయాలనే ధ్యేయంతో ఉన్నారు. అంతేకాకుండా గిరిజన గర్భిణుల వసతి కోసం నిర్మించిన గదుల్లో ఏసీ, టీవీ, గీజర్, మంచాలు, దుప్పట్లు, ప్రత్యేక లాకర్లు, తాగునీటి సౌకర్యం, వెయింగ్ మిషన్, గాలిపంకాలు, దీపాలు, రబ్బరు షీట్లు తదితర సామగ్రిని సమకూరుస్తారు.



వసతులు సమకూరనున్న పెద్దదోర్నాల సామాజిక ఆరోగ్య కేంద్రం

- న్యూస్‌టుడే, పెద్దదోర్నాల

గూడు ముసుగులో స్వాహా పర్వం

❖ మద్దిపాడులోనే రూ.6.37 కోట్ల చెల్లింపులు
❖ విచారిస్తే అక్రమాలన్నీ వెలుగులోకి !

మద్దిపాడు, నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: సకల సదుపాయాలతో ఇళ్లే కాదు.. ఊళ్లు నిర్మిస్తున్నామంటూ ఊదరగొట్టిన గత పాలకులు రూ.కోట్ల నిధులను బూడిద పాల్జేశారు. కొండలు, గుట్టలు, శ్మశానవాటికల్లో కాలనీలు నిర్మించి అప్పటి నేతలు అందినదంతా స్వాహా చేశారు. ఉన్న ధర కన్నా మూడు రెట్లు ఎక్కువ చెల్లించి పాలకులకు స్థలాలు అమ్మడం ఇందులో ఉన్న మరో తిరకాసు. ఇలా జిల్లావ్యాప్తంగా రూ. కోట్లు దండుకున్న అవినీతి అనకొండలపై విచారణ చేపట్టి ప్రజాధనాన్ని రాబట్టాలని పలువురు సూచిస్తున్నారు.

గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల ముసుగులో సాగిన దందా విస్మయానికి గురిచేస్తోంది. జిల్లాలో చాలాచోట్ల ఎకరం రూ.7 లక్షలకు అటు ఇటుగా కొనుగోలు చేసి రూ.21 లక్షల నుంచి రూ. 27 లక్షలకు ప్రభుత్వానికి అంటగట్టారు. ఈ వ్యవహారంలో వైకాపా నాయకులు చక్రంతిప్పగా, నాటి అధికారులు జీ హుజూర్ అని వత్తాసు పలికారు.



కనపర్తిలో ఈ కాలనీకి ఖర్చయింది అక్షరాలా రూ.కోటి

ప్రకృతి వనరుల్ని దోచుకుని..

మద్దిపాడు మండలంలో భూసేకరణకు ఏకంగా రూ. 6.37 కోట్లు చెల్లించారు. 1842 పట్టాలు, 43 కాలనీలు మంజూరు చేయగా, ఇప్పటికీ వందల ప్లాట్లు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నా ప్రైవేటు వాటినే సేకరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్లాట్ల కేటాయింపుల్లో వైకాపా నాయకులు.. వాలంటీర్లు.. వారి బంధువులనే అందలం ఎక్కించారు. మౌలిక సదుపాయాల పేరుతో గుండ్లకమ్మ జలాశయం నుంచి ఇసుక; అన్నంగి, బూరేపల్లి కొండలను ధ్వంసం చేసి మట్టి, కంకర వంటివి తరలించి అందినకాడికి దోచుకున్నారు.

దొడ్డవరం..వెల్లంపల్లిలో ఒక్కొక్కరే

మద్దిపాడు మండల కేంద్రంలో 340 మందికి పట్టాలివ్వగా, యాభై ఇళ్లు కూడా నిర్మించుకోలేదు. మల్లవరంలో 57 మందికి పట్టాలివ్వగా, శ్మశానం పక్కనే కాలనీ ఉండటంతో ఒక్కరు కూడా నిర్మించుకోలేదు. దొడ్డవరప్పాడులోనూ ఇదే దుస్థితి. దొడ్డవరంలో 124 ప్లాట్లు కేటాయిస్తే ఒకే ఒక్కరు నిర్మించుకుంటున్నారు. వెల్లంపల్లిలో రూ.36 లక్షలకు భూమి కొనుగోలు చేసి 55 మందికి ఇళ్ల స్థలాలివ్వగా ఒక్కరు మాత్రమే ఇంటి నిర్మాణం ప్రారంభించారు.



దొడ్డవరప్పాడులో కంప చెట్లతో జగనన్న కాలనీ

నిధులు గుమ్మరించినా..

నాగులుప్పలపాడు మండలంలో జగనన్న కాలనీలకు 1764 మందిని ఎంపిక చేయగా, 669 మంది మాత్రమే గృహాలు నిర్మించుకున్నారు. అందులో పునాది స్థాయి దాటనివి 256 ఉండగా, బేస్ లెవల్‌లో 129 ఉన్నాయి. కనపర్తిలో సుమారు కోటి రూపాయలు ఖర్చు చేసి మౌలిక సదుపాయాలు సమకూర్చినా ఇళ్ల నిర్మాణానికి ఎవరూ ముందుకురాలేదు. ఒమ్మెవరంలో ఊరికి దూరంగా కేటాయించడంతో ఎవరూ గృహాలు నిర్మించలేదు. జిల్లా వ్యాప్తంగా జరిగిన అవకతవకలపై విచారణ జరిపి అక్రమార్కుల నుంచి డబ్బులు కక్కించాలని లబ్ధిదారులు, స్థానికులు కొత్త ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

జగన్మాత దుర్గమ్మకు
మంగళసూత్రాలు.. హంసపీఠం బహూకరణ



విజయవాడ కనకదుర్గమ్మ గుడిలో మంగళసూత్రాలు సమర్పిస్తున్న కల్లగుంట అంకులయ్య, కుటుంబ సభ్యులు

కొండపి గ్రామీణం, ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మకు దాతలు బంగారు మంగళ సూత్రాలు, వెండి హంసపీఠాన్ని అలంకరణ నిమిత్తం శనివారం అందజేశారు. కొండపి పట్టణానికి చెందిన అంకులయ్య కొబ్బరి బొండాల వ్యాపారి. జగన్మాతపై ఆయనకు భక్తితో ఏటా పట్టణంలో దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అమ్మవారికి ఏదైనా చేయాలని తలంపుతో వేద పండితులు శ్రీనివాసశాస్త్రిని సంప్రదించగా మంగళసూత్రాలు అయితే నిత్యం అలంకరణకు వినియోగించే అవకాశం ఉంటుందని చెప్పారు. శక్తికి మించిన భారమైనప్పటికీ అమ్మపై ఉన్న విశ్వాసంతో రూ.18లక్షల విలువైన మంగళ సూత్రాలను బహూకరించినట్లు దాత కుటుంబం తెలిపింది. దేవస్థానం ఈవో రామారావు, ఏఈవో రాజశేఖర్ బాబు మంగళసూత్రాలను దాత కుటుంబం నుంచి స్వీకరించారు.

❖ గుంటూరుకు చెందిన చేబ్రోలు రాజకుమారి 6 కిలోల బరువున్న వెండి హంసపీఠాన్ని శనివారం అందజేశారు. జగన్మాత దుర్గమ్మ మూల విరాట్ వద్ద హంసపీఠాన్ని ఉంచి పూజ చేసిన అనంతరం దానిని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు పద్మశేఖర్ పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్డు ధర

ఒంగోలు నెక్ విజయవాడ జోన్ సూచించిన ఫారం ధర ... 100 గుడ్లు రూ. 585 ...

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 123, రిటైల్ లైవ్ - 145, చికెన్ విత్ స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్- 239

తీర ప్రాంత దశ మారుస్తా

❖ మారిటైం బోర్డు చైర్మన్ సత్య

టంగుటూరు, న్యూస్‌టుడే: తన వెన్నంటి నిలిచిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి, వారి సమస్యలు పరిష్కరిస్తానని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య పార్టీ శ్రేణులకు భరోసా ఇచ్చారు. శనివారం ఆయన ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్‌గా కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కొండపి నియోజకవర్గంలోని నాయకులు పెద్దఎత్తున మంగళగిరి చేరుకోగా.. వారి నుద్దేశించి మాట్లాడారు. జిల్లాలో తీరప్రాంత దశ మార్చేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ నాయకుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. అనంతరం సత్యను గజమాలలు.. పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. ఆయన్ను కలిసిన వారిలో గొర్రెపాటి రామయ్య చౌదరి, కొండ్రగుంట శ్రీనివాసరావు, తానికొండ వెంకటేశ్వర్లు, ఎ.రాధాకృష్ణ, బోయళ్ల శ్రీనివాసరావు, ఈదర ప్రభాకర్‌రావు, రామా గోపి, బోడపాటి అంజిబాబు, కొమ్మినేని వెంకట్రావు, కఠారి కోటయ్య, బొజ్జా శ్రీనివాసరావు, కె. శ్రీనివాసరావు, కె. శ్రీకాంత్, హరిబాబు, కె. భాస్కర్, కృష్ణ, ఎం.వెంకటరావు, పి. కోటేశ్వరరావు, బత్తిన పూర్ణ, తాటికొండ రమణ, వడ్డెళ్ల మాధవరావు, బెల్లం జయంత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సత్యను సత్కరిస్తున్న తెదేపా నాయకులు ప్రభాకర్‌రావు, గోపి, అంజిబాబు, శ్రీనివాసరావు, భాస్కర్ తదితరులు



సత్యతో పార్టీ నాయకులు కె.శ్రీనివాసరావు, రామయ్య చౌదరి, వెంకటేశ్వర్లు, బి. శ్రీనివాసరావు

గిద్దలూరు అటవీ ప్రాజెక్టు డీడీగా సచిన్ గుప్తా

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : గిద్దలూరు అటవీశాఖ ప్రాజెక్టు టైగర్ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్‌గా రాజమహేంద్రవరం ఏపీఎఫ్‌డీసీ రీజినల్ మేనేజర్, ఐఎఫ్ఎస్ అధికారి సచిన్ గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు గిద్దలూరు డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న వై.వి.నరసింహారావును అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి డీఎఫ్‌వోగా బదిలీ చేశారు.

బాలత్రిపురసుందరీదేవికి హైకోర్టు జస్టిస్ ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే : త్రిపురాంతకం ఆలయాలను శనివారం హైకోర్టు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి కుటుంబసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి జస్టిస్ కుటుంబసభ్యులకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రధాన అర్చకులు, వేద పండితులు వీరితో త్రిపురాంతకేశ్వరుని వద్ద అభిషేక పూజలు, బాలాత్రిపురసుందరీదేవికి కుంకుమార్చన పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందించారు.



ఆలయంలో కుటుంబసమేతంగా ప్రదక్షిణ చేస్తున్న హైకోర్టు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి

దసరాతో దారి మళ్లింపు

విజయవాడ ఇంద్రకీలాద్రిలో దసరా ఉత్సవాలు జరుగుతుండడంతో జాతీయ రహదారిపై వచ్చే వాహనాలను మళ్లిస్తున్నారు. విజయదశమి వరకూ దీన్ని అమలుచేస్తారు. చెన్నై నుంచి విజయవాడ వైపు వెళ్తున్న భారీ వాహనాలను త్రోవగుంట వంతెన వద్ద మళ్ళించి చీరాల వైపు పంపిస్తున్నారు. ఇది దూరాభారం కావడంతో కొందరు చోదకులు రాత్రి పది గంటల తర్వాత వెళ్దామని చీరాల రోడ్డులో వరుసగా వాహనాలను నిలిపి ఉంచారు. ఎండ తీవ్రంగా ఉండడంతో వారు ఆపసోపాలు పడ్డారు. – ఈనాడు, ఒంగోలు





మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

యర్రగొండపాలెం పట్టణం: మనస్తాపంతో ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన యర్రగొండపాలెం పట్టణంలోని పడమట బజార్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటమట బజార్‌కు చెందిన కాయకాకుల ఆంజనేయులు (25) శనివారం ఇంట్లో ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఇతనికి ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. మనస్పర్థలతో భార్యభర్తలు మూడేళ్ల క్రితం విడిపోయారు. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటూ మద్యానికి బానిసయ్యారు. శనివారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో విష రసాయనం తాగి ఆత్మహత్య చేసుకున్నారు.

రిమాండ్‌లో నిందితుడి మృతిపై విచారణ

ఒంగోలు గ్రామీణం: రిమాండ్‌లో ఉన్న నిందితుడి మృతిపై మెజిస్టీరియల్ విచారణకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. త్రిపురాంతకం స్టేషన్‌లో 186/2020లో నమోదైన కేసుకు సంబంధించి దాసు నాగరాజు(30)ను అరెస్ట్ చేసి ఒంగోలులోని జిల్లా కారాగారానికి తరలించారు. ఆ తర్వాత ఆరోగ్యం విషమించడంతో ఈ ఏడాది సెప్టెంబర్ 27న అత్యవసర చికిత్స నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. తదనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ అక్కడే మృతి చెందారు. దీనిపై మార్కాపురం ఉప కలెక్టర్‌ను మెజిస్టీరియల్ విచారణకు ఆదేశిస్తూ కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై కనుమళ్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఎస్సై మహేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు జిల్లా కావలి పట్టణం అన్నగారిపాలెం నుంచి మక్కి భాస్కరరావు(40), పెంచలయ్య ద్విచక్ర వాహనంపై ఒంగోలు వైపు వెళుతున్నారు. కనుమళ్ల గ్రామ కూడలి వద్ద వీరి వాహనాన్ని మినీ లారీ ఢీకొనడంతో భాస్కరరావుకు తీవ్ర, పెంచలయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను ఒంగోలు రిమ్స్‌కు తరలించగా, అక్కడ భాస్కరరావు మృతి చెందారు. మినీ లారీ చోదకుడు పరారయ్యాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.



గాయపడిన భాస్కరరావు (చికిత్స పొందుతూ మృతి చెందారు)

ఆటో బోల్తాపడి వృద్ధుడు..

పొదిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన శనివారం మాదాలవారిపాలెం వద్ద చోటు చేసుకుంది. ఎస్సై వేమన తెలిపిన వివరాల మేరకు. .కొనకనమిట్ల మండలం చౌటపల్లికి చెందిన సిరిగిరి రమేష్ తన ఆటోలో పొదిలికి బాడుగ నిమిత్తం నలుగురిని ఎక్కించుకుని వస్తున్నారు. పొదిలి మండలం మాదాలవారిపాలెం వద్ద వారు ప్రయాణిస్తున్న ఆటో టైరు పేలిపోవడంతో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో అందులో ఉన్న వారు రోడ్డుపై పడిపోయారు. గమనించిన స్థానికులు వారిని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే తువ్వపాడుకి చెందిన పందిటి డానియేలు (60)కు తీవ్రగాయాలు కావడంతో ప్రథమ చికిత్స చేసి ఒంగోలుకు తరలిస్తుండగా, మార్గం మధ్యలో ప్రాణాలు కోల్పోయారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు.

మార్కాపురం, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందారు. మార్కాపురం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ శివారులోని ఇందిరమ్మకాలనీకి చెందిన షేక్ చిన మస్తాన్ వలీ కూలీ పనులతో ఉపాధి పొందుతున్నారు. ఆయనకు భార్య షేక్ సలీమా, పిల్లలున్నారు. మద్యానికి బానిసైన వలీ శుక్రవారం ఉదయం ఇంట్లో నుండి బయటకు వెళ్లిపోయారు. శనివారం తర్లుపాడు రహదారిలోని మద్యం గోదాం వద్ద అపస్మారక స్థితిలో పడి ఉండగా, స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి మస్తాన్ వలీని మార్కాపురం జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విద్యుదాఘాతమా..లేక వేరే కారణాల వల్ల మృతిచెందారా అన్నది తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మార్కాపురం పట్టణ ఎస్సై ఎం.సైదుబాబు తెలిపారు.



మృతుడు షేక్ చిన్న మస్తాన్ వలి


బాధిత కుటుంబసభ్యులకు రూ.1.50లక్షల చెక్కును అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

బాధితురాలికి చెక్కు అందజేత

గిద్దలూరు పట్టణం: కొమరోలు మండలంలో ఇదమకల్లు ఎంపీయూపీ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయునిగా పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన ఎస్.కె.రిజ్వానా అన్సారీ కుటుంబసభ్యులకు యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం కింద రూ.1.50 లక్షల చెక్కును శనివారం యూటీఎఫ్ నాయకులు అందజేశారు. ఇప్పటి వరకు కుటుంబ సంక్షేమ పథకం కింద 297 మందికి సాయం అందించినట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పి.రమణారెడ్డి తెలిపారు.

మార్కాపురం

• మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

ఉప కలెక్టర్‌ను కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం ఉప కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్‌తో పాటు మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజును మార్కాపురం బార్ అసోసియేషన్ సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప కలెక్టర్, డీఎస్పీకి శాలువ కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందలు తెలిపారు.


ఉప కలెక్టర్ వెంకట త్రివినాగ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: గిద్దలూరు శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల 1980-84 డిగ్రీ చదివిన పూర్వవిద్యార్థులు శనివారం ఉదయం కళాశాల ఆవరణలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పూర్వవిద్యార్థులు కళాశాలలో చదివిన రోజులను నెమరువేసుకుంటూ సంతోషంగా గడిపారు. కళాశాల ఆవరణలో ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్వీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.పోలిరెడ్డి, పూర్వ విద్యార్థులు కోటయ్యగౌడ్, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం మండలంలోని గజ్జలకొండ గ్రామస్థులు అక్రమంగా దొంగ పత్రాలు సృష్టించి.. గ్రామ కంఠ భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తక్షణమే రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం మార్కాపురం ఉప కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గజ్జలకొండ గ్రామానికి చెందిన సిండే లింగోజికి గ్రామంలోని సర్వే నెంబరు 265లో 238 గజాల గ్రామ కంఠం స్థలంను గ్రామానికి చెందిన వ్యక్తులు అక్రమంగా దొంగ పత్రాలను సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధ్యులపైన చర్యలు తీసుకోవాలని బాధితుడికి మద్దతుగా గజ్జలకొండ ఎంపీటీసీ-2 శ్రీనివాసరెడ్డితో పాటు గ్రామస్థులు ధర్నా చేపట్టారు. అనంతరం తన సమస్యను పరిష్కరించాలని ఉప కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్‌కు వినతిపత్రం అందజేశారు. తనకు జరిగిన అన్యాయంపై జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీని కలిసి విన్నవించుకున్నట్లు తెలిపారు.

ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం

మార్కాపురం పట్టణం: పట్టణంలోని జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6నుంచి 13వ తేదీ వరకు ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం నిర్వహించనున్నారు. ఆసక్తి గల యువకులు పాల్గొనాలని నిర్వాహకులు సూచించారు.

బేకరీ ఉత్పత్తులపై అవగాహన

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: బేస్తవారపేట కేజీబీవీ విద్యార్థులు శనివారం గిద్దలూరు నగర పంచాయతీలోని ఓ బేకరీలో ఫుడ్ ప్రాసెసింగ్‌పై ఇంటర్న్‌షిప్ శిక్షణ అందజేశారు. కెజీబీవీ విద్యార్థులకు వృత్తి విద్యలో భాగంగా బేకరీ ఉత్పత్తులపై అవగాహన కల్పించారు.


యర్రగొండపాలెంలో అధికారులు స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కలు (పాత చిత్రం)

పశ్చిమాన గంజాయి దందా

● యువతే లక్ష్యం ● పెరుగుతున్న అక్రమ రవాణా ● గుట్టుచప్పుడు కాకుండా చేరవేత

మార్కాపురం, న్యూస్‌టుడే : మార్కాపురం పశ్చిమ ప్రకాశంలో యువతే లక్ష్యంగా గంజాయి సరఫరా అవుతోంది. విశాఖ ఏజెన్సీ, అరకు ప్రాంతాల్లో నుంచి అక్రమార్కులు గంజాయిని గుట్టుచప్పుడు కాకుండా రైలుమార్గాల ద్వారా సరఫరా చేస్తున్నారు. శ్రీశైలం అటవీ ప్రాంతం, దోర్నాల, యర్రగొండపాలెం ప్రాంతాలకు ఎక్కువగా గంజాయిని తీసుకొస్తున్నారు. సాధువుల దగ్గర గంజాయిని తక్కువ ధరకు సేకరించి చిన్న చిన్న పొట్లాలుగా కట్టి ఒక్కొక్క పొట్లాన్ని రూ.200 నుంచి రూ.250 వరకు మార్కాపురం పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు.



గంజాయి కేసుల వివరాలు ఇలా..

సంవత్సరం	కేసులు	నిందితులు	పట్టుబడిన కిలోలు	పట్టుబడిన చెట్లు
2019	02	03	8.9	32
2020	12	19	62.69	00
2021	08	10	40.73	307
2022	14	37	66.35	17
2023	17	61	67.04	92
2024	10	34	21.29	285
మొత్తం	63	164	267.05	733

- మార్కాపురం పట్టణంతోపాటు పల్నాడు, గుంటూరు జిల్లాలకు చెందిన ముగ్గురు యువకులు 20 కిలో గంజాయితో మార్కాపురం పోలీసులకు చిక్కారు.
- పెద్దారవీడు మండలంలోని కోమటికుంట వద్ద పల్నాడు, విజయవాడ, గుంటూరు, బెంగళూరు ప్రాంతాలకు చెందిన గంజాయి ముఠా 30 కిలోల గంజాయిని ఇతర ప్రాంతాలకు సరఫరా చేసేందుకు సిద్ధం చేసుకుంటుండగా పోలీసులు పట్టుకున్నారు.
- ఇటీవల కంభం పట్టణంలో అక్రమంగా తరలించడానికి సిద్ధంగా ఉన్న 1.03 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.

గట్టుచప్పుడు కాకుండా విక్రయాలు

మార్కాపురం ప్రాంతంలో ఎక్కువగా ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలలతో పాటు ఫార్మశీ, బీ.ఫార్మశీ కళాశాలలు అధికంగా ఉండటంతో విద్యార్థులు వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్నారు. వీరిలో క్రమశిక్షణ తప్పిన వారినే లక్ష్యంగా చేసుకొని, డబ్బుల ఆశ చూపి గంజాయి విక్రయిస్తున్నారు అక్రమార్కులు. మత్తుపదార్థాల వినియోగం పెరగడంతో యువకుల మధ్య ఘర్షణలు పట్టణ శివారు ప్రాంతాల్లో ఎక్కువయ్యాయి. యర్రగొండపాలెం, దోర్నాల ప్రాంతాల్లోను గంజాయి తీసుకునే వారు ఉండటంతో అక్కడా అమ్మకాలు గుట్టుగా సాగుతున్నాయి.

దాడులు చేస్తున్నా...ఆగని అక్రమ రవాణ

పశ్చిమ ప్రకాశంలో రోజు రోజుకు పట్టుబడుతున్న గంజాయిని చూస్తుంటే వీటిని అరికట్టడంతో పోలీసు, ఎక్సైజ్‌శాఖలు విఫలమవుతున్నట్లు అర్థమవుతుంది. అసలు మూలాల్లోకి వెళ్లకుండా నామమాత్రంగానే దాడులు చేసి అసలు ముద్దాయిలను వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసులు హడావుడి చేసిన తర్వాత కొద్ది రోజులకు సబ్దుగా ఉన్న అక్రమార్కులు మళ్లీ రైలు మార్గం ద్వారా రవాణా సాగిస్తున్నారు. పశ్చిమ ప్రాంతం గంజాయికి అడ్డాగా మారడంతో నేరాలు పెరిగే అవకాశముంది. అధికారులు సమన్వయంతో పని చేసి గంజాయికి అడ్డుకట్ట వేసి భవిష్యత్తులో విద్యార్థులు వాటికి బానిసలుగా కాకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- యర్రగొండపాలెం మండలంలో 282 గంజాయి మొక్కలను గుర్తించిన ఎక్సైజ్‌శాఖ అధికారులు వాటిని ధ్వంసం చేశారు. సాగు చేస్తున్న వారిని అదుపులోకి తీసుకొని వారికి అవగాహన కల్పించి గంజాయి సాగు చేయకూడదని చెప్పి వారిపై కేసు నమోదు చేశారు.
- దోర్నాల మండలంలోని పలు గ్రామాల్లో పత్తి, కంది పోలాల్లో గంజాయి సాగు చేశారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయండి

పెద్దదోర్నాల, బేస్తవారపేట (అర్థవీడు), గిద్దలూరు పట్టణం: న్యూస్‌టుడే: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను జిల్లా టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఈదర మల్లయ్య శనివారం ఉండవల్లిలో కలిశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళుతూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఆయన సూచించారని మల్లయ్య తెలిపారు. ● తేదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస రావు యాదవ్‌ను అర్థవీడు తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు బండ్ల మూడి ఆంజనేయులు యాదవ్ శనివారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, పూలమాలలతో సన్మానించారు. అర్థవీడు మండలంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ● ఏపీ టూరిజం ఛైర్మన్ నూకసాని బాలాజీ శనివారం తాడెపల్లెలో నిర్వహించిన ప్రమాణ స్వీకరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు


రాష్ట్ర విద్యాశాఖమంత్రి లోకేశ్‌ను కలిసిన టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మల్లయ్య

అధికారులూ సమస్యలు పరిష్కరించండి

కొమరోలు గ్రామీణం, న్యూస్‌టుడే: నూతనంగా బదిలీపై వచ్చిన మండల స్థాయి అధికారులు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజల మన్ననలను పొందాలని ఎంపీపీ కామూరి అమూల్య పేర్కొన్నారు. మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్తు, విద్య, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్టీసీ, తాగునీటి సమస్యలపై ఎంపీటీసీలు, సర్పంచులు అధికారులను ప్రశ్నించారు. పలు సమస్యలపై సమావేశంలో చర్చ జరిగింది. కొమరోలు ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడి పనితీరు సరిగ్గా లేకపోవడంతో పదో తరగతి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీ ఎంఈవో బీవీరత్నం దృష్టికి తీసుకురాగా, ప్రధానోపాధ్యాయుడికి తెలిపి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. మండలంలోని తాగునీటి ట్యాంకులు అపరిశుభ్రంగా ఉండటంతో వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మస్తాన్ వలీ, ఉప తహసీల్దారు వెంకటయ్య, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


విద్యుత్తు సమస్యలపై అధికారులను అడుగుతున్న ఎంపీపీ కామూరి అమూల్యా

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి గౌతు సత్యేంద్రబాబు పేర్కొన్నారు. ఆయన శనివారం గిద్దలూరులో జరిగిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డు వినియోగంలో కల్తీ నెయ్యిపై నిజాలు తెలియకుండా మాట్లాడటం దారుణమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని తెలిపారు. నిరసన, ధర్నాలు చేపట్టేందుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పగడాల రంగస్వామి, కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఎం.సత్యనారాయణ, జానకి రంగనాయకులు, కె.గోపాల్, షేక్ జమాల్, శివ తదితరులు పాల్గొన్నారు.


పార్టీ నియోజకవర్గ సమావేశంలో పాల్గొన్న నాయకులు

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే:

సమస్య: పట్టణంలోని ఎస్సీ, బీసీ కాలనీలో డ్రైనేజీ కాలువలు లేక పోవడంతో మురుగునీరు నిలిచి దోమలు బెడద ఎక్కువైంది. కాలువలు నిర్మించండి. – **గోపాల్, కాలనీవాసి**

సమాధానం: కొన్ని చోట్లను గతంలో కాలువలను నిర్మించాం. నిధులు లేక కొత్తవి చేపట్టలేదు. మంజూరైన వెంటనే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. – **ఎం.ఆదినారాయణ, మున్సిపల్ ఏఈ**

బెల్లం ఊట ధ్వంసం

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: నల్లగుంట్ల సమీపంలోని అటవీ ప్రాంతంలో సారా తయారు చేసే బట్టీలపై ఎస్సై మహేష్ శనివారం సిబ్బందితో దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న వంద లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

మద్యం సీసాల స్వాధీనం..

యర్రగొండపాలెం పట్టణం: మండలంలోని నర్సాయపాలెం గ్రామంలో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎస్సై చౌడయ్య సిబ్బందితో శనివారం దాడి చేశారు. ఈ దాడిలో గ్రామానికి చెందిన పాశం రమణయ్య 18 మద్యం బాటిళ్లు అక్రమంగా అమ్ముతుండగా పట్టుకున్నారు. ఇతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రెస్టారెంట్లలో తనిఖీలు

కంభం: రెస్టారెంట్లు, హోటళ్లలో అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ మల్లికార్జున, ఎస్సై నరసింహారావు అన్నారు. పట్టణంలోని పలు రెస్టారెంట్లలో శనివారం రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హోటళ్లలో మద్యం అమ్మడం, తాగడం నిషేధమని చెప్పారు.

బాధ్యతల స్వీకరణ



కొనకనమిట్ల, న్యూస్‌టుడే: కొనకనమిట్ల పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. తర్లుపాడు మండలంలో పనిచేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన నిరంజన్ వెలిగండ్ల మండలానికి బదిలీ చేశారు.

నిబంధనలు పాటించండి

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం పట్టణంతో పాటు మండలంలోని ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పట్టణంలో ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలుపరాదని మార్కాపురం సీఐ సుబ్బారావు ఆదేశించారు. శనివారం మార్కాపురం పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో పట్టణ, మండలంలోని ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, క్రమబద్ధీకరణ, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇష్టానుసారంగా రహదారిపై నిలిపివేసి మధ్యలోనే ప్రయాణికులను ఎక్కించుకోవడం మానుకోవాలన్నారు. ట్రాఫిక్ నియమాలపై ఆటో డ్రైవర్ల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై సైదుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు


పెద్దదోర్నాలలో గాయత్రి దేవీగా..


కొమరోలు: అన్నపూర్ణ దేవీగా


బేస్తవారపేట: నటరాజేశ్వరీదేవిగా


మార్కాపురం పట్టణం: ధనలక్ష్మీగా


కంభం : భువనేశ్వరీదేవిగా

అన్నపూర్ణమ్మగా.. సాక్షాత్కారం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మూడోరోజు శనివారం మండలాల్లో పలు ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. మార్కాపురం చెన్నకేశవ స్వామి ఆలయంలో ధనలక్ష్మీగా, శివాలయంలో చంద్రఘంట అలంకరణలో, బేస్తవారపేటలో నటరాజేశ్వరీదేవిగా, సోమవారపేట, కొమరోలు, రావిపాడు, రాచర్ల, యర్రగొండపాలెంలో అన్నపూర్ణదేవిగా, పెద్దదోర్నాల, పుల్లలచెరువులో గాయత్రిదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. కంభంలో భువనేశ్వరీదేవిగా, అమ్మవారికి కుంకుమార్చనలు, మహా నివేదన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా కొమరోలులోని వేంకటేశ్వర ఆలయంలో కల్పవృక్ష వాహనంపై దేవేరులను ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

– న్యూస్‌టుడే బృందం


పుల్లచెరువు: గాయత్రి దేవిగా..


యర్రగొండపాలెంలో అన్నపూర్ణదేవిగా..


రాచర్ల : అన్నపూర్ణాదేవిగా


కంభం : రావిపాడులో


మార్కాపురం పట్టణం: చంద్రఘంటల అలంకరణలో

శివాజీ రథయాత్ర

మార్కాపురం పట్టణం: ఆరె మారాఠా సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఛత్రపతి శివాజీ రథయాత్ర శనివారం మార్కాపురం పట్టణం చేరుకుంది. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ శివాజీ 1676లో తెలుగు గడ్డపై అడుగు పెట్టారని తెలిపారు. ఆదివారం శ్రీశైలంలోని శివాజీ స్ఫూర్తి కేంద్రం వద్దకు రథయాత్ర చేరుకుంటుందని, ఈ యాత్రలను దిగ్విజయం చేయాలని కోరారు.


తెల్లదిన్నె సమీపంలో వంతెన నిర్మించాల్సిన ప్రాంతం

కలగానే వంతెనల నిర్మాణం..!

● రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కంభం, న్యూస్‌టుడే: రహదారులపై రాకపోకలు సాఫీగా సాగాలంటే వాగులు, వంకలపై వంతెనలు ఉంటేనే వీలవుతుంది. అయితే మండలంలోని చాలా ప్రాంతాల్లో నదులపై వంతెనలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలోని తెల్లదిన్నె సమీపంలో గుండ్లకమ్మ నదిపై చప్టా నిర్మించాలని దశాబ్దాలు తెల్లదిన్నె, ఎల్.కోట, ఔరంగాబాద్, లింగోజిపల్లి, రెట్లపల్లి, పెద్దఓబినేనిపల్లి తదితర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇక్కడ బ్రిడ్జి నిర్మిస్తే ఆయా గ్రామాల ప్రజలు పెద్దఓబినేనిపల్లి వద్ద ఉన్న ఒంగోలు రోడ్డుకు వెళ్లేందుకు దగ్గరి దారి ఏర్పడుతుంది. ఒంగోలు, కనిగిరి తదితర ప్రాంతాలకు తొందరగా వెళ్లేందుకు వీలు కలుగుతుంది. రెట్లపల్లి, పెద్దఓబినేనిపల్లి వాసులు కంభం త్వరగా చేరుకోవచ్చు. కానీ ఇప్పటి వరకూ ఇక్కడ కాజ్‌వే నిర్మాణానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గతేడాది ఇక్కడ వంతెనతో పాటుగా, అధ్వానంగా ఉన్న ఎల్.కోట-తెల్లదిన్నె రోడ్డును బాగు చేసేందుకు నిధులు మంజూరయ్యాయి. పనులు మాత్రం పూర్తి కాలేదు.

శ్మశానానికి వెళ్లేందుకు కష్టమే

కంభం మండలం రావిపాడు గ్రామానికి ఉత్తరం వైపున గుండ్లకమ్మ నది అవతలి వైపు శ్మశానం ఉంది. అక్కడికి వెళ్లాలంటే వాగు దాటాల్సి వస్తోంది. సుమారు అయిదేళ్ల నుంచి వాగు ప్రవహిస్తోంది. గ్రామానికి చెందిన మృతి చెందిన ప్రతిసారి ప్రవహిస్తున్న నీటిలో నుంచి మృతదేహాలను మోసుకెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్మశానం వైపు సుమారు వందల ఎకరాల పొలం ఉంది. ఆ భూముల వద్దకు వెళ్లేందుకు, పంట ఉత్పత్తులు ఇళ్లకు చేర్చుకునేందుకు, పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాగు ఉద్ధృతి ఎక్కువైతే రాకపోకలు నిలిచిపోతున్నాయి. వాగుపై కాజ్‌వే నిర్మించాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాగులపై వంతెనలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. వంతెన నిర్మాణానికి రూ.20 లక్షలతో ప్రతిపాదనలు పంపించినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. నిధులు మంజూరైతే పనులు చేయిస్తామని చెప్పారు.


రావిపాడు వద్ద వాగులో నడిచి వస్తున్న గ్రామస్థులు

మేమున్నాం.. మీకు తోడుగా.. కనిగిరి : 8008574114, దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని ఉమ్మనపల్లి ఎస్సీ కాలనీలో ఏడాదిగా మంచినీటి ట్యాంకునుంచి నీరు రావడం లేదు. కాలనీ వాసులు నీటికి బోర్లపై ఆధారపడుతున్నారు. ట్యాంకును బాగుచేయించి నీటిని విడుదల చేయాలి.
–ప్రభుదాస్, కాలనీవాసి

సమాధానం: సర్పంచికి సూచనలిచ్చి ట్యాంకు మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.
–శ్రీకాంత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

కురిచేడు, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని అలవలపాడు ప్రధాన వీధిలో పక్కా కాలువలు ఏర్పాటు చేయకపోవడం వల్ల నివాసాల్లో నుంచి వచ్చే మురుగు రహదారి పక్కన చేరి చిన్నపాటి కుంటలను తలపిస్తోంది. దుర్వాసనతోపాటు దోమలు వ్యాప్తి అధికమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము.
– అనిల్, స్థానికుడు

సమాధానం: పక్కా కాలువలు నిర్మించాలని గ్రామ సభలో తీర్మానం చేశాం. త్వరలోనే కాలువలు నిర్మించి సమస్యను పరిష్కరిస్తాం.– అల్లూర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి

మర్రిపూడి, న్యూస్‌టుడే:

సమస్య: మండలంలోని కాకర్ల పంచాయతీ శివరాయునిపేట బీసీ కాలనీలో కాలువలు లేకపోవడంతో మురుగునీరు ఇళ్ల ముందు నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. –కోటయ్య, గ్రామస్థుడు

సమాధానం: కాలువల ఏర్పాటుకు ఇటీవల ప్రతిపాదనలు పంపించాం. పారిశుద్ధ్య పనులు చేయించి బ్లీచింగ్ చల్లిస్తాం.
–డేవిడ్, పంచాయతీ కార్యదర్శి

కనిగిరి

• కనిగిరి • దర్శి • కొండపి


1,652 పొగాకు బేళ్ల కొనుగోలు

టంగుటూరు, న్యూస్‌టుడే: టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో శనివారం 535 బేళ్లు కొనుగోలు జరిగాయి. టంగుటూరు, తూర్పు నాయుడుపాలెం, కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం, చిర్రికూరపాడు, ఆలకూరపాడు తదితర గ్రామాలకు చెందిన రైతులు 740 బేళ్లను తీసుకురాగా.. అందులో 205 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.358, కనిష్ఠ ధర రూ.100లు పలికిందని వేలం కేంద్ర నిర్వాహకులు అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు.

◗ కొండపి గ్రామీణం: కొండపి వేలం కేంద్రంలో శనివారం జరిగిన వేలంలో కిలో పొగాకు కనిష్ఠ ధర రూ. 100 పలికిందని వేలం నిర్వహణాధికారి జి. సునీల్ కుమార్ తెలిపారు. బోర్డు పరిధిలోని అనకర్లపూడి, పెరిదేపి, మిట్టపాలెం తదితర గ్రామాలకు చెందిన రైతులు 1,332 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, అందులో 1,117 బేళ్లను కొనుగోలు చేశారు. మిగిలిన వాటిని తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.358, సరాసరి ధర రూ.184.30 పలికిందన్నారు.

మెలకువలు పాటిస్తే నాణ్యమైన పొగనారు

● రైతులు తప్పక రిజిస్ట్రేషన్ చేసుకోవాలి ● 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో టంగుటూరు బోర్డు వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు



ముఖాముఖి 2024-25 పంట కాలానికి పొగాకు నారుమడులు సిద్ధమయ్యాయి. గత రెండేళ్లుగా అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకుకు ఉన్న డిమాండ్‌తో అధిక ధరలు పలికాయి. దీంతో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ క్రమంలో బోర్డు అధికారుల సూచనలు రైతులు తప్పక పాటించాల్సిన అవసరం ఉందని టంగుటూరు పొగాకు వేలం కేంద్ర నిర్వాహకులు అట్లూరి శ్రీనివాసరావు చెబుతున్నారు. ప్రస్తుతం పొగాకు నారుమడుల సస్యరక్షణ చర్యలు, ఇతర వివరాలను 'న్యూస్‌టుడే' ముఖాముఖిలో వెల్లడించారు.- న్యూస్‌టుడే, టంగుటూరు

? న్యూస్‌టుడే: బోర్డు పరిధిలో ఎన్ని హెక్టార్లలో నారుదొడ్లు సిద్ధం చేశారు?

✓ వేలం నిర్వహణాధికారి: టంగుటూరు బోర్డు పరిధిలో ఇప్పటి వరకు 50 హెక్టార్లలో నారుదొడ్లు సాగు చేశారు. అదనంగా సాగు పెరిగే అవకాశం ఉంది. గత ఏడాది 141 మంది రైతులు 283.4 హెక్టార్లలో సాగు చేశారు. ఏటా 120 మంది వరకు రైతులు నారుదొడ్లు సాగు చేస్తుంటారు. ఇప్పటి వరకు బోర్డు పరిధిలో ముగ్గురు రైతులు మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

? : ఏ రకం విత్తనాలు పొగాకు సాగుకు అనుకూలం?

✓: బోర్డు పరిధిలో జరుగుమల్లి మండలం వావిలేటిపాడు, గొర్లమిట్ట, మట్టిపాడు ప్రాంతాల్లో మాత్రమే ఈ ఏడాది పొగాకు సాగు చేపట్టారు. తెగుళ్ల వ్యాపిస్తాయనే కారణంతో రైతులు చోడవరం, ఉప్పలదిన్నె, పైడిపాడు తదితర ప్రాంతాలకు వెళ్లిపోయారు. జిల్లా వ్యాప్తంగా వర్జీనియా రకానికి చెందిన సిరి, ఎఫ్‌సీఆర్-15 రకాలు మాత్రమే సాగు చేస్తుంటారు. సీటీఆర్ఐ సిఫార్సు చేసిన విత్తనాలను మాత్రమే నారు పెంచాలి.



నారుమడులను పరిశీలిస్తున్న బోర్డు అధికారులు

? : ప్రస్తుతానికి నారుమడులు ఏ దశలో ఉన్నాయి?

✓: నర్సరీల్లో ప్రస్తుతానికి నారుమడుల వయస్సు వారం నుంచి 30 రోజుల వరకు మొక్కలు ఉన్నాయి. 50 నుంచి 60 రోజుల సమయానికి మొక్కలు అందుబాటులోకి వస్తాయి. ఒక్కో నర్సరీ 90 రోజుల వరకు నిర్వహణ జరుగుతోంది. పశ్చిమ ప్రాంత వాసులు ఇప్పటికే నాట్లు వేయడం ప్రారంభించారు. మన వద్ద తగిన వర్షపాతం లేకపోవడంతో రైతులు కాస్త జంకుతున్నారు.

? : తెగుళ్లు, వైరస్‌ల నివారణకు సూచనలు?

✓: ప్రస్తుతం నారుదొడ్లలో ఎలాంటి తెగుళ్లు, వైరస్‌లు లేవు. నారుమళ్లలో ఏటా వచ్చే మాగుడు, ఆకుమచ్చ (నల్లకాడ, మానుకుళ్లు), చుక్క తెగుళ్లు (తెల్లచుక్క, కప్పకన్ను), గోధుమ మచ్చ, సీతాఫలం, వేరుకుళ్లు, పొగాకు మల్లె తెగుళ్లు వస్తుంటాయి. వీటితో పాటు నేల పెంకి పురుగు, పొగాకు లద్దెపురుగు, కాండము తొలుచు పురుగు, తెల్లదోమ, ఆకుముడత, మొవ్వపురుగు, పేనుబంక వంటి చీడపీడలు వ్యాప్తి చెందుతుంటాయి. వీటి నివారణకు బోర్డు అధికారుల సూచనల మేరకు పురుగుమందులు, జీవన సంబంధమైన పురుగుమందులు, లింగాకర్షక బుట్టలు, ఎరపంటలు, పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకోవాలి.

? : నారుమళ్ల పెంపకంలో పాటించాల్సిన మెలకువలు?

✓: పొగాకు నారుమళ్లకు నీటి పారుదల గల ఎర్రగరప నేలలు, ఇసుక నేలలు శ్రేష్ఠమైనవి. ప్రతి సంవత్సరం భూమి మార్చితే తెగుళ్ల బెడద ఉండదు. పంట సాగుకు వినియోగించే నీటిలో క్లోరైడ్స్ 50 పీపీఎం దాటి ఉండకూడదు. రైతులు ఆధునిక పద్ధతుల ద్వారా ట్రే నర్సరీ లేక సూక్ష్మ తుంపర విధానాన్ని పాటించడం వల్ల నాణ్యమైన, ఆరోగ్యవంతమైన నారు పొందవచ్చు. నేలలకు సిఫార్సు చేసిన పొగాకు వంగడాలను మాత్రమే వాడుకోవాలి.

అఖిలాండేశ్వరి.. అన్నపూర్ణాదేవి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కనిగిరి, కొండపి, దర్శి నియోజకవర్గాల్లోని ఆలయాల్లో అమ్మవార్లను శనివారం అన్నపూర్ణాదేవి, పార్వతీదేవి, గాయత్రి దేవి, ధనలక్ష్మీదేవి, లలిత త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయాల్లో హోమాలు తదితర ప్రత్యేక పూజలు జరిగాయి. దర్శి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మహిళా భక్తులు నవదుర్గల వేషధారణలో ఆకట్టుకున్నారు. ముండ్లమూరు మండలం మారెళ్ల శ్రీ హర హర క్షేత్రంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కుంకుమార్చనలు చేశారు. తాళ్లూరు మండలం బొద్దికూరపాడు రామాలయంలో బాలికలు అన్నపూర్ణాదేవి వేషధారణలో ఆకట్టుకున్నారు.
–న్యూస్‌టుడే, బృందం



దర్శి: వాసవీమాత ఆలయంలో నవదుర్గలుగా మహిళల వేషధారణ



సి.ఎస్.పురం: అన్నపూర్ణాదేవిగా పెద్దమ్మతల్లి



దొనకొండలో ధనలక్ష్మీదేవిగా..

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కనిగిరి పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడిని ప్రత్యేక పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. 101 మంది దంపతులు సామూహిక వ్రతాలు చేశారు. దేవస్థానం ప్రాంగణంలో స్వామివారి పల్లకి సేవ నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. దేవస్థాన కమిటీ సభ్యులు గోనుగుంట గోపాల్, నార్లపాటి సాంబశివరావు, నారపురెడ్డి తిరుపతిరెడ్డి, వెంకటసత్యనారాయణ తదితరులు భక్తులకు అన్నదానం చేశారు. –న్యూస్‌టుడే, కనిగిరి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

రోడ్లు వేశారు.. కాలువలు మరిచారు



గత అయిదేళ్ల వైకాపా పాలనలో గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడంతో కనీసం కాలువల్లో పూడికలు కూడా తీయలేని పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల కాలువల నిర్మాణాలు పూర్తిగా చేపట్టలేదు. దర్శి మండలం చందలూరులోని పలు వీధుల్లో సైడు కాలువలు లేక గృహాల నుంచి వచ్చే మురుగు రోడ్లపై నిలిచి పోతోంది. దీంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. సీసీ రోడ్లు వేసినా డ్రైనేజీలు నిర్మించపోవడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచి దోమలు వ్యాపిస్తున్నాయని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కాలువల నిర్మాణానికి చొరవ తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై పంచాయతీ అధికారులను వివరణ కోరగా.. కూటమి ప్రభుత్వం పంచాయతీలకు నిధులు కేటాయించిందని, వాటితో ప్రణాళికలు తయారు చేసి పనులు చేపడతామని తెలిపారు.
–న్యూస్‌టుడే, దర్శి

లోపలికెళ్తే ముక్కు మూసుకోవాల్సిందే..!



అక్కడి మరుగుదొడ్లు వినియోగించుకోవాలంటే ముక్కులు మూసుకోవాల్సిందే. ఎంత మంది ఎంపీడీవోలు మారినా మరుగుదొడ్లు మాత్రం పట్టించుకోక పోవడంతో కార్యాలయంలోని సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. కొండపి మండల పరిషత్తు కార్యాలయంలో కొన్ని నెలలుగా మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. దీంతో వాటిని వినియోగించుకునే సమయంలో సిబ్బంది ముక్కులు మూసుకోవాల్సి వస్తుంది. అలాగే నీళ్లు కూడా రావడం లేదు. బకెట్లతో తీసుకెళ్లాల్సిన పరిస్థితి. ఈ విషయంపై ఎంపీడీవో బి.రామాంజనేయులును వివరణ కోరగా రెండు రోజుల్లో మరమ్మతులు చేయించి వాడుకలోకి తీసుకొస్తామని తెలిపారు. –న్యూస్‌టుడే, కొండపి గ్రామీణం

కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తం

ముండ్లమూరు: కాలానుగుణ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో సురేష్ సూచించారు. శనివారం మండలంలోని మారెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, రికార్డులు, ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టి జ్వరాలు ఉంటే నమోదు చేయాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్యులు జాస్మిన్, వెంకటేశ్వరరెడ్డి, ప్రవీణ్ కుమార్, మధుశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి వినియోగంపై అవగాహన అవసరం

దర్శి: దర్శిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధిపై అవగాహన కల్పించారు. కేవీకే సమన్వయకర్త డా.రమేష్ మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయంలో నీటి వినియోగంపై కనీస పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. పీఎం కిసాన్ నిధి 18వ విడత నిధుల విడుదల కార్యక్రమ ఉద్దేశాన్ని ఆయన వివరించారు.

తాళ్లూరు ఎంఈవో ఇంట్లో చోరీ

అద్దంకి, న్యూస్‌టుడే: తాళ్లూరు ఎంఈవో ఇంట్లో దొంగలు పడ్డారు. పోలీసుల సమాచారం మేరకు.. తాళ్లూరు ఎంఈవోగా జి.సుబ్బయ్య, ఆయన భార్య సుబ్బలక్ష్మి అద్దంకిలోని ఓ ప్రైవేటు విద్యాలయంలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. వాసవీ నగర్ చివర్లోని ఇంట్లో వీరు నివసిస్తున్నారు. కింది భాగం అద్దెకు ఇవ్వగా పైఅంతస్తులో ఉంటున్నారు. శుక్రవారం రాత్రి ఇంట్లో పడుకున్న దంపతులు శనివారం ఉదయం లేవగా చోరీ జరిగినట్లు గుర్తించారు. బీరువాలో దాచుకున్న రూ.లక్ష నగదుతో పాటు మొత్తం తొమ్మిది వస్తువులు కలిపి 64 గ్రాముల బంగారం అపహరణకు గురైనట్లు నిర్ధారించుకున్నారు. ఆమేరకు అద్దంకి పోలీసులకు ఎంఈవో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పాము కాటుతో రైతు మృతి

దర్శి, న్యూస్‌టుడే: పాముకాటుతో పొలంలోనే రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని మారెడ్డిపల్లిలో శనివారం వెలుగు చూసింది. ఎస్సై మురళి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దాసరి కేశవరావు (54) శుక్రవారం సాయంత్రం కంది పంటను చూడడానికి వెళ్లారు. పాము కాటువేయటంతో అక్కడే పడిపోయారు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకటం ప్రారంభించారు. ఈ క్రమంలో పొలంలో మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. కాలిపై పాము కరిచినట్లుగా గాట్లు, రక్తస్రావం కనిపించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు

పామూరు: మండలంలోని లక్ష్మీనరసాపురం సమీపంలో శుక్రవారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపారు. బొట్లగూడూరుకు చెందిన కోనేటి కృష్ణయ్య కనిగిరి ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. విధులకు హాజరయ్యేందుకు పామూరుకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఈ ఘటన జరిగింది. గాయపడిన కృష్ణయ్యను ఒంగోలు వైద్యశాలకు తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు..

ఏలూరుకు చెందిన యువతి (26) 11 నెలల నుంచి పామూరులోని ఓ చర్చిలో సేవకురాలిగా పనిచేస్తున్నారు. ఆమె ఈ నెల 3 నుంచి కనింపించడం లేదని, బంధువుల ఇళ్ల వద్ద విచారించినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపారు.

మురుగు కదలదు.. దోమలు వదలవు

న్యూస్‌టుడే, పామూరు

పామూరు మేజర్ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువల్లో ఎక్కడికక్కడే మురుగునీరు నిలిచిపోయి దుర్వాసనతో పాటు దోమల బెడదతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. స్థానిక నేతాజీనగర్, కాపు వీధి, ఎస్‌బీఐ వెనుక తదితర ప్రాంతాల్లో కాలువలు మురుగు, వ్యర్థాలతో నిండిపోయాయి. నేతాజీనగర్‌లో గత వైకాపా ప్రభుత్వ హయాంలో యంత్రాలతో మట్టి కాలువలు ఏర్పాటు చేశారు. అవుట్‌లెట్ లేకుండా పైపుల ద్వారా కాలువను ఏర్పాటు చేయవద్దని ఆ ప్రాంతానికి చెందినవారు అధికారులును ప్రాధేయపడినా వినకుండా కాలువలు తీశారు. ఇందులో మురుగునీటి పారుదల సరిగా లేక, ఏళ్ల తరబడి కాలువలను శుభ్రం చేయకపోవడం, మురుగు, వ్యర్థాలను తొలగించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. కాలువల నిర్వహణ గాలికొదిలేయడంతో మూడున్నరేళ్లుగా మురుగునీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారు. ఈ కాలువలో తూడు, చిల్లచెట్లు దట్టంగా పెరిగాయి. చిన్న పిల్లలు పడినా ప్రమాదం జరిగే వీలుంది. దీనికితోడు పలు వీధుల్లో ఏర్పాటు చేసిన కాలువల్లో మురుగునీరు సవ్యంగా ముందుకు పోవడం లేదు. ఎక్కడికక్కడే నిలిచిపోతుంది. ఒక్కోసారి కాలువలు నిండిపోయి రహదారులపైకి మురుగు పొర్లుతోంది. తమ ప్రాంతంలోని సమస్యపై ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పరిష్కారం కాలేదని నేతాజీ నగర్ వాసులు వాపోతున్నారు. మురుగునీటి పారుదల సరిగా జరిగేలా, అవుట్ లెట్ ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు మురుగు, వ్యర్థాలను తొలగించేలా అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి వి.బ్రహ్మానందరెడ్డిని వివరణ కోరగా తూడు, మురుగును తొలగించేలా, కాలువ నిర్వహణ సక్రమంగా ఉండేలా చూస్తామని తెలిపారు.



నేతాజీనగర్‌లోని మురుగు కాలువలో పశువులు

ఇసుక ట్రాక్టర్ ఆపారని రెవెన్యూ సిబ్బందితో గొడవ

జరుగుమల్లి, న్యూస్‌టుడే: ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆపారనే కారణంతో రెవెన్యూ సిబ్బందితో డ్రైవర్ గొడవకు దిగిన సంఘటన మండలంలోని వావిలేటిపాడు సమీపంలో శనివారం చోటుచేసుకుంది. తహసీల్దార్ జనార్దన్ తెలిపిన వివరాల మేరకు.. చింతలపాలేం పాలేరు వాగు సమీపంలోని పట్టా భూముల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా రెండు ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా తహసీల్దారు ఆపి తనిఖీ చేశారు. అనంతరం వాహనాలను వీఆర్వో బి.శ్రీనివాసరావుకు అప్పగించి పోలీస్ స్టేషన్‌కు తరలించాలని ఆదేశించారు. దీంతో ఒక ట్రాక్టర్ డ్రైవర్ వీఆర్వోతో వాగ్వాదానికి దిగారు. అంతటితో ఆగకుండా ఆయనపైకి ఏకంగా దాడికి యత్నించారు. వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించాల్సిందేనని వీఆర్వో చెప్పడంతో డ్రైవర్ తీసుకెళ్లారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. ఈ విషయం తెలుసుకున్న ఇసుక ట్రాక్టర్ అద్దెకు తీసుకున్న వ్యక్తి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి ఆయనతో గొడవకు దిగారు. వాహనాన్ని విడిచిపెట్టాలని కొద్దిసేపు హల్‌చల్ చేశారు. తహసీల్దార్ కుదరదని తేల్చిచెప్పడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు.

సూర్య ఘర్ పథకానికి పాలేటిపాడు ఎంపిక

జరుగుమల్లి, న్యూస్‌టుడే: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బెల్లం నిర్మల అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో శనివారం జరిగింది. మండలం వ్యాప్తంగా 5,900 మంది రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ నగదు జమచేశారని, జమకాని రైతులు తమ కార్యాలయంలో సంప్రదించాలని ఏవో యుగంధర్‌రెడ్డి తెలిపారు. పాడిరైతుల కోసం 90 శాతం రాయితీతో గోకులం షెడ్ల నిర్మాణానికి అవకాశం ఉందన్నారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకానికి మండలంలోని పాలేటిపాడును ఎంపిక చేశామని, సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్తు శాఖ అధికారి హర్షిష్ తెలిపారు. చేసిన పనులకు అధికారులు బిల్లులు చెల్లించకపోతే ఎలా అని పైడిపాడు సర్పంచి బాస్కర్‌చౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ పులి భిక్షాలు, ఎంపీడీవో వి.ఎం.రమణమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిశోర్, పీఆర్ ఏఈ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

నిఘా కళ్లు.. చోరీలకు ముకుతాడు


న్యూస్‌టుడే, సింగరాయకొండ గ్రామీణం

- **ఏడాది క్రితం సింగరాయకొండ పట్టాభి వారి వీధిలో తాళాలు వేసి ఉన్న ఇంట్లో అర్ధ రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బీరువా ధ్వంసం చేసి నగదు, బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు.**
- **గత నెలలో మూలగుంటపాడులో నివాసముంటున్న ఉపాధ్యాయుడు హైదరాబాద్‌కు తన కుటుంబంతో కలిసి శుభకార్యానికి వెళ్లగా అర్ధరాత్రి సమయంలో దుండగులు ప్రధాన ద్వారం ధ్వంసం చేసి లోపలకు ప్రవేశించి బీరువాలోని సుమారు 10 సవర్ల బంగారు ఆభరణాలు, కొంత నగదు అపహరించారు.**

సింగరాయకొండ మండలంలో తరచూ చోరీలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పెద్దపెద్ద దొంగతనాలే వెలుగుచూస్తుండగా.. చిన్నవి ఇంకా అనేకం జరుగుతున్నాయి. దుండగుల ఆటకట్టించే సీసీ కెమెరాలు వైకాపా నిర్లక్ష్య పాలనలో అలంకార ప్రాయంగా మారాయి. గతంలో దాతలు స్పందించి సమకూర్చినా వాటి నిర్వహణను గాలికొదిలేశారు. ఫలితంగా దొంగలు రెచ్చిపోతున్నారు.

జంట గ్రామాల్లో భయాందోళనలు..

సింగరాయకొండ మండల కేంద్రంలో గత మూడేళ్లుగా కొందరు దుండగులు నివాసాలు, దుకాణాల్లో చోరీలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. తాళాలు వేసిన దుకాణాలు, ఇళ్లే లక్ష్యంగా చేసుకుని నిలువునా నగదు, ఆభరణాలను చోరీ చేస్తూ అంతరాష్ట్ర దొంగలు పేట్రేగిపోతున్నారు. మూడేళ్ల క్రితం పోలీసులు దాతల సహకారంతో సింగరాయకొండలో సుమారు 50 సీసీ కెమెరాలను అమర్చారు. అనంతరం విధులు నిర్వహించిన పోలీసు అధికారులు వాటిపై దృష్టిసారించక పోవడంతో కొన్ని మరమ్మతులకు గురై మూలకు చేరాయి. కొన్ని ప్రాంతాల్లో వాటి తీగలు చోరీలకు గురై అలంకారప్రాయంగానే మిగిలాయి. దీంతో దుండగులు మేజరు పంచాయతీలైన సింగరాయకొండ, పాత సింగరాయకొండ జంట గ్రామాల్లో పగలు, రాత్రి అనే తేడాలేకుండా చోరీలకు పాల్పడ్డారు. దీంతో జిల్లా ఎస్పీ దామోదర్ ప్రత్యేక దృష్టి సారించి మండలంలో నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని స్థానిక పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు.



సింగరాయకొండ ప్రధాన రహదారి వద్ద సీసీ కెమెరా ఏర్పాటును పరిశీలిస్తున్న ఎస్సై మహేంద్ర

దొంగల ఆట కట్టిస్తాం..

మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వెంబడి, కూడళ్లు, శివారు ప్రాంతాల్లో వారం రోజులుగా దాతల సహకారంతో 35 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. వీటివల్ల నేరాలు నియంత్రించవచ్చు. నేరస్థుల కదలికలను ఎప్పటికప్పుడు గమనించి రహస్య ప్రాంతాల్లో సిబ్బందితో నిఘా ఏర్పాటు చేసి వారి ఆటకట్టించవచ్చు. రెండేళ్లగా అంతరాష్ట్ర దొంగలు సింగరాయకొండ, పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ తాళాలు వేసిన నివాసాలే లక్ష్యంగా ఎంచుకుని చోరీలకు పాల్పడుతున్నారు. త్వరలో మండల పరిధిలో సుమారు 200 సీసీ కెమెరాలు అమర్చేందుకు కృషి చేస్తున్నాం.
–బి.మహేంద్ర, ఎస్సై, సింగరాయకొండ

పీఆర్ డీఈగా శ్రీధర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి పంచాయతీరాజ్ శాఖ డీఈగా సి.శ్రీధర్‌రెడ్డి శనివారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఆదిశేషు పొదిలికి బదిలీపై వెళ్లారు. సింగరాయకొండలో పనిచేస్తూ శ్రీధర్‌రెడ్డి ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరి సహకారంతో ముందుకు వెళ్తామన్నారు.

కొండపి ఎస్సైగా ప్రేమ్‌కుమార్..



కొండపి గ్రామీణం: కొండపి ఎస్సైగా బి.ప్రేమ్ కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన క్రిష్ణబాజీబాబు ఒంగోలు వీఆర్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న ప్రేమ్‌కుమార్‌ను నియమించారు.

◗ **హెచ్‌ఎంపాడు ఈవోఆర్డీగా హనుమంతరావు:** హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: హెచ్‌ఎంపాడు ఈవోఆర్డీగా ఎంవీ.హనుమంతారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అద్దంకి నుంచి ఇక్కడికి వచ్చారు. మండల పరిషత్ కార్యాలయ ఏవో కృష్ణారావు సింగరాయకొండకు బదిలీపై వెళ్లగా, కొమరోలు నుంచి వి.రామకృష్ణ ఇక్కడికి వచ్చారు. ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మధుసూధన్‌రెడ్డి వెలిగండ్లకు వెళ్లగా అక్కడి నుంచి గూడూరి రమేష్ ఇక్కడికి వచ్చారు. మండలంలోని నాలుగు పంచాయతీలకు కొత్త వీఆర్వోలు విధుల్లో చేరారు. పెద్దగొల్లపల్లికి ఎస్.నాసర్, కూటాగుండ్లకు పరశురామ్, సీతారాంపురానికి ఎస్.షబ్బీర్, వాలిచెర్లకు ఎం.ఎం.శేషులను నియమించారు.

◗ **మండల సర్వేయరుగా నాగరాజు..: తాళ్లూరు**: మండల సర్వేయరుగా నాగరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఒంగోలులోని ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న బాబూరావును జరుగుమల్లి తహసీల్దారు కార్యాలయానికి బదిలీ చేశారు. తహసీల్దారు కె.రాజ్యలక్ష్మిని నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామ సర్వేయర్లు, ఇతర సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

భైరవకోనలో ఆర్డీవో పూజలు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన శైవ పుణ్యక్షేత్రం భైరవకోన, మిట్టపాలెం నారాయణస్వామి ఆలయాలను నూతన ఆర్డీవో జి.కేశవర్ధన్‌రెడ్డి దంపతులు శనివారం సందర్శించారు. భైరవకోనలో జలపాతాన్ని వీక్షించి కాలభైరవేశ్వరస్వామి, త్రిముఖ దుర్గాంబ, శివలింగాలను, మిట్టపాలెం నారాయణస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్లు పి.వెంకటేశ్వర్లు, రమేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాటరీ వాహనం అందజేత

ఒంగోలు గ్రామీణం: హనుమంతునిపాడు మండలం హనుమంతునిపురానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడు బి.జానుకు... బ్యాటరీతో నడిచే మూడు చక్రాల వాహనాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ రోణంకి గోపాలకృష్ణ చేతులమీదుగా శనివారం అందజేశారు. రూ.46 వేల విలువైన ఈ వాహనాన్ని జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ద్వారా మంజూరు చేశారు.

నిరంతర విద్యుత్తు సరఫరాకు కృషి

ముండ్లమూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా ప్రజలకు నాణ్యమైన విద్యుత్తును ఇవ్వాలని దర్శి ఈఈ పి.శ్రీనివాసరావు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని శంకరాపురం, మారెళ్ల, ఈదర, గ్రామాల్లోని ఉపకేంద్రాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య లేకుండా చూడాలన్నారు. అవసరమైనచోట పరివర్తకాలు ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. ప్రస్తుతం గ్రామాల్లో వర్షాలు కురుస్తున్నందున కరెంటు సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఇన్‌ఛార్జి ఏఈ ఇమ్మాన్యుయేల్, ఎల్.ఐ. సాంబయ్య, లైన్‌మేన్లు ఆంజనేయులు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ముండ్లమూరు ఉపకేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈఈ శ్రీనివాసులు

ఒంగోలు

•ఒంగోలు •సంతనూతలపాడు

రాయితీలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన

కొత్తపట్నం, న్యూస్‌టుడే: మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని డీఆర్డీఏ పీడీ వసుంధర పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ సమాఖ్య సమావేశాలను ఈ నెల 15లోగా పూర్తిచేయాలన్నారు. స్త్రీనిధి, ఉన్నతి రుణాల రికవరీ వంద శాతంగా ఉండాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న రాయితీలు, పథకాలపై అవగాహన కల్పించి స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చేలా సభ్యుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఏసీ విజయ, ఏపీఎం విజయకుమారి పాల్గొన్నారు.

బ్యాటరీ వాహనం అందజేత

ఒంగోలు గ్రామీణం: హనుమంతుని పాడు మండలం హనుమంతునిపాడుకు చెందిన విభిన్న ప్రతిభావంతుడు బి. జానుకు... బ్యాటరీతో నడిచే మూడు చక్రాల వాహనాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ రోణంకి గోపాలకృష్ణ చేతులమీదుగా శనివారం అందజేశారు. ఏడీ అర్చన పాల్గొన్నారు.

రైజ్‌లో స్వాగత సంబరాలు



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: రైజ్ కృష్ణ సాయి కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. బీటెక్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులు పాల్గొని సందడి చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గత విద్యాసంవత్సరంలో ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కళాశాల కార్యదర్శి సిద్ధా హనుమంతరావు, రాగ ముఖ్య సలహాదారు ప్రవల్లిక, డైరెక్టర్ బ్రహ్మసూర్యరావు, ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

దాహార్తిని దూరం చేసేలా కార్యాచరణ

- వైకాపా పాలనలో పడకేసిన పనుల పూర్తికి చర్యలు
- రెండు రోజుల్లో చెరువులకు సాగర్ జలాలు


తెదేపా హయాంలో చేపట్టిన ఫిల్టర్ బెడ్, ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణాలు... గత వైకాపా ప్రభుత్వం వీటిని పూర్తిచేయకుండా విస్మరించింది.

ఒంగోలు... కాలంతో సంబంధం లేకుండా నీటి ఎద్దడి కొనసాగే నగరం. సాగర్ జలాలపైనే పూర్తిగా ఆధారపడాల్సి రావడంతో నిత్యం సమస్య నెలకొంటోంది. శాశ్వత పరిష్కారం దిశగా అప్పటి తెదేపా ప్రభుత్వం అమృత్ పథకం కింద పనులు చేపట్టినా... తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటిని గాలికి వదిలేసింది. పైపెచ్చు రూ.339 కోట్లతో నగరంలో నీటి ఇక్కట్లు తొలగిస్తామని ముఖ్యమంత్రి హోదాలో జగన్‌మోహన్ రెడ్డి ఘనంగా ప్రకటించినా... తరువాత పైసా విదల్చక నేటికీ అవస్థలు తప్పడం లేదు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం సమస్యపై దృష్టి సారించింది. ప్రత్యేక కార్యాచరణ రూపొందించి మూడు నెలల్లో చాలా వరకు పనులు పూర్తిచేసింది. -న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

పాత పైపులైను స్థానంలో కొత్తది...

నగరంలోని రామనగర్, కొత్తపట్నం బస్టాండ్, అద్దంకి బస్టాండ్, ఇస్లాంపేట, గద్దలగుంట ఓవర్‌హెడ్ ట్యాంకులకు సీతారాంపురం కొండమీద ఉన్న ట్యాంకు నుంచి నీరు సరఫరా అవుతోంది. ఇందుకోసం భాగ్యనగర్ ప్రధాన రహదారి వెంట పదిహేళ్ల క్రితం వేసిన పైపులైను కాలదోషం పట్టి తరచూ లీకవుతోంది. దీనివల్ల విలువైన జలాలు వృథా కావడంతో పాటు... ఆ రోడ్డు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కొత్త పైపు లైను కోసం నిధులు కేటాయించినా పనులు పూర్తిచేయలేదు. కూటమి ప్రభుత్వం వాటిని పూర్తిచేయించింది. మూడు నాలుగు రోజుల్లో కొత్తలైన్‌కు కలపనున్నారు.

ఇళ్లకు అమృత్ కుళాయిలు...



నగరాలు, పట్టణాల్లో ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి ఇవ్వాలన్న లక్ష్యంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం... అమృత్-2 కింద నగరానికి 6,300 కుళాయిలు మంజూరు చేసింది. ఈ పథకం కింద 5,600 కుళాయిలు ఇప్పటికే మంజూరు చేశారు. వీటి విషయంలోనూ గత వైకాపా పాలకులు చేతివాటం చూపారు. పాత వాటినే కొత్తగా వేసినట్టు చూపి బిల్లులు చేసుకున్నారు. తాజాగా... మిగిలిన 700 కనెక్షను అర్హులైన వారికి ఇవ్వాలని నిర్ణయించారు. పేదలకు రూ.200కే కనెక్షన్ ఇస్తారు. ఇతరులు ఎనిమిది సులభవాయిదాల్లో డిపాజిట్ మొత్తం రూ.6 వేలు చెల్లించి కుళాయి పొందవచ్చు. అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని కార్పొరేషన్ అధికారులు తెలిపారు.

గుండ్లకమ్మ నీటి రాకకు మార్గం...

2014-19లో అప్పటి తెదేపా ప్రభుత్వం అమృత్-1 కింద నగరానికి కేటాయించిన రూ.123 కోట్లతో గుండ్లకమ్మ జలాశయం నుంచి ఒంగోలుకు ప్రత్యేకంగా పైపులైన్ వేశారు. వచ్చే నీటిని శుద్ధి చేసేందుకు ఓ ఫిల్టరేషన్ ప్లాంటు, మూడు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మించారు. తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం వీటిని పూర్తిగా పక్కన పెట్టేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో... పాత పైపులైనుకే కొత్తది కలిపి కొద్ది రోజులు నీటిని తెచ్చారు. గుండ్లకమ్మ నిర్వహణను పూర్తిగా గాలికొదిలేయడంతో గేట్లు కొట్టుకుపోయి జలాశయం ఖాళీ అవ్వడంతో... తరువాత ఆ భాగ్యమూ లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక... మూడు నెలల్లో మిగిలిన పైపులైను పనులు పూర్తిచేసింది. గుండ్లకమ్మ జలాశయాన్నీ గాడిలో పెట్టింది. నేరుగా అక్కడి నుంచి చెరువులకు నీరు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేషన్ ఇంజినీర్ చంద్రయ్య తెలిపారు.


రెండో నీటి నిల్వ చెరువు

		ఒకటో చెరువు	రెండోది
పూర్తి సామర్థ్యం	(మి.లీ.ల్లో)	1,950	3,650
ప్రస్తుత నిల్వ		1,100	2,050

నగరంలో రోజువారీ వినియోగం 40 మి.లీ. ప్రస్తుతం రెండు చెరువుల్లో ఉన్న నిల్వలు డెడ్ స్టోరేజీ పోను నెల రోజులు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రామతీర్థం జలాలతో వీటిని పూర్తిస్థాయిలో నింపేందుకు నిర్ణయించారు. సోమవారం నుంచి నీటిని విడుదల చేసేలా నగర పాలక సంస్థ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు... జిల్లా అధికారులు, జలవనరుల శాఖ ఎస్ఈ వరలక్ష్మితో మాట్లాడారు. చెరువులు పూర్తిస్థాయిలో నిండితే నగర అవసరాలకు మూడు నెలల పాటు ఎటువంటి ఢోకా ఉండదు.

అభినందనల వెల్లువ


సత్యను అభినందిస్తున్న మంత్రులు స్వామి, రవికుమార్, ఎమ్మెల్యేలు


సోదరుడిని ఆత్మీయ ఆలింగనం చేసుకున్న ఎమ్మెల్యే జనార్దన్

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్‌గా మంగళగిరిలో శనివారం బాధ్యతలు చేపట్టిన దామచర్ల సత్యానారాయణ (సత్య); రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా విజయవాడలో బాధ్యతలు స్వీకరించిన నూకసాని బాలాజీలను... ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు కలిసి అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర మంత్రులు డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్; ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్. విజయకుమార్, ఏలూరి సాంబశివరావు, ముత్తుముల అశోక్‌రెడ్డి; తెదేపా యర్రగొండపాలెం నియోజకవర్గ బాధ్యుడు గూడూరి ఎరిక్షన్‌బాబు తదితరులు పాల్గొన్నారు. బాధ్యతల స్వీకరణ వేడుకకు జిల్లా నుంచి ప్రత్యేక వాహనాల్లో ర్యాలీగా తరలివెళ్లారు.

'గోకులం'తో పశుపోషకులకు ప్రయోజనం

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: ప్రభుత్వం రాయితీపై సమకూరుస్తున్న గోకులం షెడ్లు... పశు, జీవాల పోషకులకు ఉపయుక్తంగా ఉంటాయని ఉపాధి హామీ ఏపీడీ వెంకటస్వామి పేర్కొన్నారు. లబ్ధిదారులతో ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఇచ్చిన కొలతల మేరకు షెడ్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఉపాధి పనులు వెంటనే ప్రారంభించాలని సిబ్బందికి తెలిపారు. ఏపీవో కె.వాసంతి, టీఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

జవాబు పత్రాల కోడింగ్ కేంద్రం తనిఖీ


కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏకేయూ ఉపకులపతి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం పరిపాలనా భవనంలో ఏర్పాటు చేసిన డిగ్రీ జవాబు పత్రాల కోడింగ్ కేంద్రాన్ని శనివారం ఉపకులపతి డీవీఆర్ మూర్తి తనిఖీ చేశారు. ప్రస్తుతం బీఎడ్ మొదటి సెమిస్టర్ జవాబు పత్రాల కోడింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉపకులపతి అక్కడ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న ఆర్.శ్రీనివాస్‌తో మాట్లాడారు. కోడింగ్ కార్యక్రమం విజయవంతంగా పూర్తిచేయడానికి అందుబాటులో ఉన్న సిబ్బందిని వినియోగించుకోవాలన్నారు. అనంతరం కంట్రోల్ బండిల్ పేపర్‌ను పరిశీలించారు. ఒక్కో కంట్రోల్ బండిల్‌లో 40 మంది విద్యార్థులు సమాధాన పత్రాలు ఉండేలా ఏర్పాటు చేశామన్నారు. కోడింగ్ పూర్తయిన వెంటనే మూల్యాంకనం చేపట్టాలన్నారు. ఎటువంటి అవాంతరాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏసీటీఈ అమృతవల్లి, పరీక్షల విభాగం పర్యవేక్షకులు శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వీవోఏల నిరసన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: తమ పరిష్కరించాలని వెలుగు యానిమేటర్లు (వీవోఏ) కలెక్టరేట్ వద్ద శనివారం ఆందోళన చేపట్టారు. కమిటీ జిల్లా అధ్యక్షుడు గంగాధర మాట్లాడుతూ... కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయడంతో పాటు... అన్ని రకాల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాసులు, వీవోఏల సంఘం ప్రతినిధులు దూదేకుల జెరీనా, కాశీరత్నం, భ్రమరాంబ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు. తొలుత కలెక్టరేట్ ఎదుట ర్యాలీ నిర్వహించారు.

మాచవరంలో ఉచిత పశు వైద్య సేవలు


పశు పోషకులకు మందులు అందజేస్తున్న జేడీఏ బేబీరాణి

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: పశువుల్లో కాలానుగుణ వ్యాధులు తలెత్తకుండా ముందస్తు టీకాలు వేస్తున్నట్లు జేడీఏ డాక్టర్ బేబీరాణి తెలిపారు. ఆచార్య ఎన్జీరంగా సేవా ఫౌండేషన్, పశు గణాభివృద్ధి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బి.మాచవరంలో మంగళవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరంలో మాట్లాడారు. 47 గేదెలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు నామినేని మోహన్‌రావు, పశు గణాభివృద్ధి శాఖ డీడీ చంద్రశేఖరరావు, డాక్టర్ ఎం.నాగభూషణం, ఏడీఏలు కె.సుధీర్‌బాబు, టి.లావణ్యకుమారి, బి.ప్రదీప్‌రెడ్డి, మండల పశువైద్యాధికారి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

అనుమతికి మించి పండిస్తే అనర్థమే



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బోర్డు ఛైర్మన్ యశ్వంత్

మద్దిపాడు, న్యూస్‌టుడే: అనుమతికి మించి పొగాకు సాగు చేస్తే నష్టం తప్పదని గుంటూరు బోర్డు ఛైర్మన్ చిడిపోతు యశ్వంత్ పేర్కొన్నారు. వెల్లంపల్లి వేలం కేంద్రంలో పొగాకు అమ్మకాలు పూర్తయిన సందర్భంగా శనివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా మార్కెట్ ఉంటుందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. బోర్డు ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ... వెల్లంపల్లిలో 215 మిలియన్ కిలోల అమ్మకాలతో పాటు రికార్డు స్థాయిలో ధరలు లభించాయన్నారు. వచ్చే సీజన్‌కు నిర్దేశిత మోతాదులోనే పంట వేయాలన్నారు. ప్రాంతీయ మేనేజర్ కృష్ణశ్రీ, ఎక్స్‌టెన్షన్ మేనేజర్ దామోదర్, బోర్డు కార్యదర్శి దివి వేణుగోపాల్, సూపరింటెండెంట్ కోవి రామకృష్ణ, అబ్బూరి శేషగిరిరావు, నారిపెద్ది వరహాలచౌదరి, బోర్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

డీపీవో కార్యాలయ పూర్వ ఏవోపై ఫిర్యాదు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీ కార్యాలయం పూర్వ ఏవో అవినీతి, అక్రమాలతో పాటు దస్త్రాలు మాయం చేయడంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు విశ్రాంత పంచాయతీ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు శనివారం ఫిర్యాదు చేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో కందుకూరు డీఎల్‌పీవో కార్యాలయానికి వెళ్లిన ఆయన డిప్యుటేషన్‌పై మళ్లీ ఒంగోలు వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. గత 22 ఏళ్లుగా ఎటువంటి బదిలీలు లేకుండా ఒంగోలులోనే కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని కోరారు.

నేడు శ్రీవారి భక్తులకు అన్న ప్రసాద వితరణ

ఒంగోలు గ్రామీణం: తిరుమలలోని శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అన్న ప్రసాద వితరణకు ఒంగోలులోని గోవింద పాదయాత్ర బృందానికి శనివారం అవకాశం కల్పించారు. తిరుపతి కపిలతీర్థం నుంచి అలిపిరి మధ్యలో అన్న ప్రసాదాలు అందజేయనున్నట్లు గౌరవ అధ్యక్షుడు టీవీఎస్ ఆదినారాయణ, బృంద సభ్యులు తెలిపారు.

షెడ్లకు జియో ట్యాగింగ్ తప్పనిసరి

మద్దిపాడు: మినీ గోకులం షెడ్లకు జియో ట్యాగింగ్ తప్పనిసరి అని ఎంపీడీవో వి.జ్యోతి తెలిపారు. ఎంపిక చేసిన 26 మంది లబ్ధిదారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉపాధి హామీ ఏపీవో ధనుంజయవర్మ మాట్లాడుతూ... గేదెల షెడ్ల ఏర్పాటుకు 24, జీవాల షెడ్‌లకు ఇద్దరు ఎంపికయ్యారని చెప్పారు. సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు. ◗ పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ కార్యదర్శులు, మహిళా పోలీసులు సమన్వయంతో పని చేయాలన్నారు. వీరికి ఇంటి పన్నుల వసూలు బాధ్యతను అప్పగించారు. కార్యాలయం సూపరింటెండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

కనులపండువ


గాయత్రీదేవిగా జ్వాలాముఖి


చీమకుర్తి: హరిహర క్షేత్రంలో...


ఇసుకవాగు శివాలయంలో...

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. నగరంలోని వివిధ దేవస్థానాలతో పాటు చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల్లోని పలు ఆలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి విశేష పూజాదికాలు నిర్వహించారు. సాయంత్రం ఆయా ప్రాంగణాల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. శ్రీగిరి ఆలయంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు సువర్ణ అష్ట దళ పద్మ పాదార్చన నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తల మండలి ఛైర్‌పర్సన్ ఝాన్సీరాణి, కార్యనిర్వహణ ధర్మకర్త సి.వి.రామకృష్ణారావు తెలిపారు.
– న్యూస్‌టుడే బృందం


సంతపేట: బాబా మందిరంలో గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు


లాయర్‌పేట: అన్నపూర్ణాదేవిగా...

ఆర్డీవో లక్ష్మీప్రసన్న బాధ్యతల స్వీకరణ


కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న ఆర్డీవో లక్ష్మీప్రసన్న

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్డీవోగా కంబాలకుంట లక్ష్మీప్రసన్న శనివారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా నందలూరు మండలం టంగుటూరుకు చెందిన ఆమె... పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ 2023లో నిర్వహించిన గ్రూప్-1లో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంక్ సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. మంగళగిరిలోని హెచ్‌ఆర్డీఏలో రెండు రోజుల క్రితమే శిక్షణ పూర్తి చేసుకున్నారు. డివిజన్‌లోని తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. తొలుత కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ రోణంకి గోపాలకృష్ణ, డీఆర్వో శ్రీలతను నూతన ఆర్డీవో మర్యాదపూర్వకంగా కలిశారు.



జడ్పీ ఉప సీఈవోగా బాలమ్మ: ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జడ్పీ ఉప సీఈవోగా పావులూరి బాలమ్మ శనివారం బాధ్యతలు స్వీకరించారు. డ్వామా తెనాలి క్లస్టర్ ఏపీడీగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. సీఈవో చిరంజీవి, ఉద్యోగులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుత ఉప సీఈవో హనుమంతరావు రిలీవ్ అయ్యారు. తదుపరి పోస్టింగ్ నిమిత్తం ప్రభుత్వానికి రిపోర్టు చేయనున్నారు.

ఆర్డీవో సుబ్బారెడ్డికి సన్మానం : ఒంగోలు గ్రామీణం: ఆర్డీవో బాధ్యతల నుంచి రిలీవ్ అయిన సుబ్బారెడ్డిని శనివారం ఘనంగా సన్మానించారు. పలువురు తహసీల్దార్లు మాట్లాడుతూ... ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా సార్వత్రిక ఎన్నికల క్రతువును సజావుగా నిర్వహించారని కొనియాడారు. అర్జీల పరిష్కారానికి కృషి చేశారన్నారు. నూతన ఆర్డీవో లక్ష్మీప్రసన్న, కార్యాలయ ఏవో కృష్ణారావు, డివిజన్ పరిధిలోని అధికారులు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు త్వరలో కు.ని. శస్త్రచికిత్సలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరంలో వీధి కుక్కల నియంత్రణకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు పశు సంవర్ధకశాఖ అధికారులు, స్నేహ యానిమల్ సొసైటీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో శనివారం సమావేశం నిర్వహించి... వారి సూచనలు తీసుకున్నారు. వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించనున్నట్లు తెలిపారు. ఈ విషయమై పర్యవేక్షక కమిటీ ఏర్పాటు చేయాలని... స్వచ్ఛంద సంస్థల సభ్యులకు అందులో చోటుకల్పించాలని పలువురు సూచించారు. ఆరోగ్య అధికారి మనోహరరెడ్డి మాట్లాడుతూ కొత్తమామిడిపాలెంలోని చెత్త నిర్వహణ కేంద్రం వద్ద శస్త్రచికిత్సలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శానిటరీ సూపర్‌వైజర్లు ఎన్.పిచ్చయ్య, షేక్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

కంది రవిశంకర్‌కు సత్కారం: ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జనసేన పార్టీలో చేరిన వ్యాపారవేత్త కంది రవిశంకర్‌ను జిల్లా కాపు సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. పార్టీలో ఉన్నత పదవులు పొందాలని వక్తలు ఆకాంక్షించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవ్‌కుమార్, పార్టీ జిల్లా కార్యదర్శులు చనపతి రాంబాబు, కల్యాణ్ ముత్యాల, నగర కార్యదర్శులు ఆకుపాటి ఉష, సాయినాయుడు తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి, న్యూస్‌టుడే:

?: గాంధీనగర్ ఆరో వీధి శివారులోని ఖాళీ స్థలాల్లో... చిల్ల చెట్లు పెరిగి పాములు, విష కీటకాలు సంచరిస్తున్నాయి. రాత్రి వేళ అటుగా వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నాం.
– కోదాటి ఆంజనేయులు, చీమకుర్తి

✓:ఆయా ప్రాంతాల్లో చిల్లచెట్లు, వ్యర్థాల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. – వై.రామకృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్

?: చీమకుర్తి సూర్యనగర్ చర్చి బజారులో... కొన్ని వీధి దీపాలు గత కొద్ది రోజులుగా వెలగడం లేదు.
– జి.శ్రీనివాసరావు, స్థానికుడు

✓: పరిశీలించి వెంటనే సమస్య పరిష్కరిస్తాం.
– గోపి, వర్క్ ఇన్‌స్పెక్టర్

ఉడ్ కాంప్లెక్స్... వరద ఇక్కట్లకు చెక్!


పోతురాజు కాలువకు అనుసంధానం చేసేలా పనులు...

ఉడ్ కాంప్లెక్స్.. చిన్నపాటి జల్లు పడినా నీరుపోయే దారిలేక చెరువులా మారుతుంది. భారీ వర్షాల సమయంలో పరిస్థితి మరి చెప్పనవసరం లేదు. పూర్తిగా జలమయమై రెండు మూడు రోజుల పాటు పనులు చేయలేదని దుస్థితి. చెక్క సైతం కొట్టుకుపోతుంది. పదహారో నంబరు జాతీయ రహదారి విస్తరణ సమయంలో తగిన జాగ్రత్తలు పాటించకపోవడంతో... రోడ్డు అవతలకు వరద పోయే మార్గానికి అడ్డంకి ఏర్పడడంతో సమస్య నెలకొంది. పక్క కాలువలు ఉన్నా... గత వైకాపా పాలకులు పట్టించుకోక మట్టి, వ్యర్థాలతో పూడిపోయాయి. వర్షం పడిన ప్రతిసారీ ఇబ్బందులు తలెత్తుతుండడంతో యజమానులు, కార్మికులు... పలుమార్లు సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. ఏపీఐఐసీ అధికారులు సైతం పట్టించుకున్న దాఖలాలు లేవు. అంతర్గత రహదారులతో పాటు ఇతర వసతులూ అంతంతమాత్రంగానే ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వంద రోజుల కార్యాచరణలో భాగంగా... ఆయా కాలువల్లో పూడిక, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తోంది. ఉన్న కాలువలను మరింత వెడల్పు చేసి... నేరుగా పోతురాజు కాలువకు అనుసంధానం చేస్తోంది. దీంతో ఇకపై వర్షం పడినా సమస్య ఉండదు. ఈ పనులతో సమీప వెంకటేశ్వరకాలనీ వాసుల ఇక్కట్లూ తీరనున్నాయి.
– ఈనాడు, ఒంగోలు; న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్య రోడ్డు


ఉడ్ కాంప్లెక్స్ వద్ద రూపుమారిన కాలువ

● ప్రస్తుతం ఉడ్ కాంప్లెక్స్‌లో 40 కంపెనీలు ఉన్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 500 మంది ఉపాధి పొందుతున్నారు. వర్షాల సమయంలో పనులకు వీల్లేకపోవడం, వాహనాల రాకపోకలకూ అంతరాయం కలుగుతుండడంతో... కొనుగోలుదారులు విజయవాడ, తెనాలి మార్కెట్‌లకు తరలిపోతున్నారని పలువురు యజమానులు వాపోతున్నారు. వసతులు కల్పిస్తే ఇక్కడే మార్కెట్ అభివృద్ధి చెంది మరింత మందికి ఉపాధి లభిస్తుందని చెబుతున్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

మద్దిపాడు: వివాదాలకు తావులేకుండా దసరా ఉత్సవాలు నిర్వహించుకోవాలని మద్దిపాడు ఎస్సై శివరామయ్య పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అనుమతి లేకుండా ఆర్కెస్ట్రా, డీజే వంటివి ఏర్పాటు చేయరాదన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

లారీలు ఢీకొని డ్రైవర్‌కు గాయాలు

చీమకుర్తి: ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొన్న ప్రమాదంలో... తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీ డ్రైవర్ కరణ్‌కు గాయాలయ్యాయి. పశ్చిమ బైపాస్ కూడలిలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.సుబ్బారావు తెలిపారు.

కోడి పందేల శిబిరంపై దాడి: చీమకుర్తి: చంద్రపాడు - లక్ష్మీపురం గ్రామాల మధ్య శనివారం నిర్వహించిన కోడి పందేల శిబిరంపై దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సుబ్బారావు తెలిపారు. వారి నుంచి రెండు కోళ్లు, రూ.14 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.